TGTEL/25/A0977

# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 45 | గురువారం 09-10-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

## నాదర్‌గుల్‌లో హైడ్రా కూల్చివేతలు..

**హైదరాబాద్, అక్టోబరు8:**
రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల నాదర్‌గుల్‌లో హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలను(వెంచర్)బుధవారం కూల్చివేశారు. ఇక్కడ 1986లో టెలికాం కో - ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఒక వెంచర్‌గా దాదాపు 100 ఎకరాల భూమిలో ప్లాట్లను ఏర్పాటు చేసి, సొసైటీ సభ్యులకు పంపిణీ చేసింది. అయితే, 2016లో ధరణి ద్వారా అక్రమ పాస్‌బుక్కులు సృష్టించి, సొసైటీకి చెందిన భూమిలో మరో నూతన వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో దాదాపు 23 ఇంటి నిర్మాణ అనుమతులని అక్రమంగా పొందారు. ఈ అక్రమాలను గమనించిన అసలైన ప్లాట్ యజమానులు కలెక్టర్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బాధితులు హైడ్రా ఆశ్రయం తీసుకున్నారు. ఈ విషయంపై హైడ్రా అధికారులు సమగ్ర విచారణ జరిపి, అక్రమంగా మంజూరైన పర్మిషన్లను రద్దు చేశారు. అనంతరం అసలైన యజమానులకు వారి ప్లాట్లను తిరిగి అందజేశారు.

## మా ఓపికను పరీక్షించొద్దు.. హైకోర్టు హెచ్చరిక..

**నవీ ముంబై:** పిటిషనర్లను ఉద్దేశించి తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇదే చివరి విచారణ కాదని.. అన్ని అంశాలనూ ప్రస్తావించొద్దని సూచించింది. తమ ఓపికను పరీక్షించకండంటూ పిటిషనర్లను ఉద్దేశించి సున్నితంగా హెచ్చరించింది. గంటలకొద్దీ ఒకే అంశం ప్రస్తావించి, తమ సమయాన్ని వృథా చేయొద్దని చెప్పింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపు లాయర్ అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలు వినిపించారు. బీసీ రిజర్వేషన్ల పై అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించాయని చెప్పారు. జీఓ పై స్టే ఇవ్వాలని కోరడం సరైంది కాదని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం ప్రభుత్వానికి ఉందని చెప్పారు. పిటిషనర్ లాయర్లు ఇన్నిగంటలు వాదనలు వినిపిస్తే.. మాకు అవకాశం వస్తుందా.. అంటూ ప్రశ్నించారు. కులగణన లెక్కలు ఫోర్జరీ అనుకుంటున్నారా.. వాస్తవాలు తెలియకుండా పిటిషనర్లు ఎలా మాట్లాడుతారని అన్నారు. 2018లో తెలంగాణ పంచాయితీరాజ్ చట్టం పాసైన సమయంలో ఈ కసరత్తు జరగలేదని, 2019లో EWS 10 రిజర్వేషన్లు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయని అభిషేక్ మను సింఘ్వీ గుర్తు చేశారు. ఫలితంగా మొత్తం రిజర్వేషన్లు 50% దాటి అదనంగా 10 %.. అంటే మొత్తం రిజర్వేషన్ల శాతం 60 శాతానికి చేరుకుందని చెప్పారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు

# రేపే నోటిఫికేషన్..




**హైదరాబాద్:** తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలకు దాదాపు లైన్ క్లియర్ అయినట్లే. బీసీ రిజర్వేషన్ల అంశం విచారణ సందర్భంగా గురువారం నాడు విడుదలయ్యే ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వాలన్న పిటిషనర్ వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో గురువారం యథావిధిగా నోటిఫికేషన్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేయనుంది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల ప్రక్రియపై చర్చించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు తామంతా సిద్ధంగా ఉన్నామని అన్ని జిల్లాల కలెక్టర్లు ఈసీకి తెలిపారు. నానినేషన్ల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూసుకోవాలని ఈసీ ఆదేశించారు.

### రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ..

కాగా, 5 దశల్లో 31 జిల్లాల్లోని 565 మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఈసీ షెడ్యూల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. గురువారం (అక్టోబర్ 9) నాడు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు తొలి నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అనంతరం ఉదయం 10:30 గంటల నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభిస్తారు. అలాగే అక్టోబర్ 13 నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు రెండో విడత నామినేషన్ల ప్రక్రియ మ్మొదలుపెడతారు. అక్టోబర్ 23న ఎంపీటీసీ, జడ్పీటీసీ తొలి విడత పోలింగ్.. అక్టోబర్ 27న రెండో విడత పోలింగ్ ఉంటుంది. నవంబర్ 11న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

### మూడు దశల్లో గ్రామ పంచాయతీ..

అలాగే మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ నిర్ణయించింది. అక్టోబర్ 17న సర్పంచ్ ఎన్నికలకు తొలి విడత నోటిఫికేషన్ జారీ చేస్తుంది ఎన్నికల కమిషన్. అక్టోబర్ 17 నుంచి 19 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అక్టోబర్ 31న తొలి విడత పోలింగ్, ఫలితాలు ఉంటాయి. ఇక, అక్టోబర్ 21న రెండో విడత నోటిఫికేషన్ విడుదల చేస్తారు. రెండో విడతలో అక్టోబర్ 21న నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ.. నవంబర్ 4న రెండో విడత పోలింగ్ నిర్వహించి అదే రోజున ఫలితాలు విడుదల చేస్తారు. మూడో విడత సర్పంచ్ ఎన్నికలకు అక్టోబర్ 25న నోటిఫికేషన్ ఇచ్చి.. అక్టోబర్ 25 నుంచి 27 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. మూడో విడత సర్పంచ్ ఎన్నికలకు నవంబర్ 8న పోలింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు. అయితే, తెలంగాణ హైకోర్టు స్టే కారణంగా 14 ఎంపీటీసీ, 27 గ్రామ పంచాయతీలు, 246 వార్డులకు ఎన్నికలు వాయిదా పడ్డాయి.

## 26/11 తర్వాత పాక్‌పై ఎందుకు దాడి చేయలేదో కాంగ్రెస్ చెప్పాలి: మోదీ



**నవీ ముంబై:** దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 2008లో జరిగిన ఉగ్రదాడులకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దీటుగా స్పందించలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. విదేశీ ఒత్తిడులకు తలొగ్గిందని విమర్శించారు. ఉగ్రదాడి అనంతరం సైనిక చర్యను అడ్డుకుంటూ ఆనాడు నిర్ణయం తీసుకున్నదెవరో చెప్పాలని కాంగ్రెస్‌ను నిలదీశారు మోదీ. నవీ ముంబై అంతర్జాతీయ విమాశ్రయం ఫేజ్-1ను మోదీ బుధవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ, దేశంలో అత్యంత శక్తివంతమైన నగరాల్లో ముంబై ఒకటి కావడంతోనే ఉగ్రవాదులు దానిపై దాడి చేశారన్నారు. ఉగ్రదాడికి దీటుగా సైనిక చర్య తీసుకోకుండా ఇండియాపై ఒక దేశం ఒత్తిడి తెచ్చిందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ హోంమంత్రి చిదంబరం ఇటీవల చేసిన వ్యాఖ్యలను ప్రధాని ప్రస్తావించారు. నాటి నిర్ణయం ఎవరు తీసుకున్నారో కాంగ్రెస్ చెప్పాలని, దేశ ప్రజలకు ఈ విషయం తెలియాలని అన్నారు. కాంగ్రెస్ చూపించిన బలహీనతే ఉగ్రవాదులకు బలంగా మారిందన్నారు. జాతీయ భద్రత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీపడిందని ఆక్షేపించారు.

**మాకు జాతీయ భద్రతే ముఖ్యం**

తమ ప్రభుత్వానికి దేశం, దేశ పౌరుల భద్రతే అత్యంత ముఖ్యమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో మిలటరీ యాక్షన్ చేపట్టామని గుర్తు చేశారు. ఉగ్రవాదంపై తమ ప్రభుత్వం నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటుందనడానికి ఇదే ఉదాహరణ అని చెప్పారు.

## మంత్రుల మధ్య ముగిసిన వివాదం



**హైదరాబాద్, అక్టోబర్ 8:** తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్ అడ్లూరి లక్ష్మణ్ మధ్య వివాదం ముగిసింది. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చొరవతో ఇద్దరి మధ్య వివాదానికి తెరపడినట్లైంది. ఎట్టకేలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పారు. 'లక్ష్మణ్ బాధ పడిన దానికి నేను క్షమాపణలు కోరుతున్న. లక్ష్మణ్‌కు వ్యక్తిగతంగా క్షమాపణలు చెప్తున్న. కరీంనగర్‌లో మాదిగ సామాజిక వర్గంతో నేను కలిసి పెరిగా' అంటూ మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు. కాగా.. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో అడ్లూరిని ఉద్దేశించి పొన్నం అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సోషల్ మీడియాలో రచ్చ చెలరేగింది. పొన్నం వ్యాఖ్యలను అడ్లూరి తీవ్రంగా ఖండించగా.. తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని పొన్నం చెప్పుకొచ్చారు. ఈ వివాదం చిలికిచిలికి గాలి వానగా మారింది. ఈ క్రమంలో మంత్రుల మధ్య సయోధ్య కుదిర్చేందుకు పీసీసీ చీఫ్ రంగంలోకి దిగారు. అందులో భాగంగానే ఈరోజు ఉదయం పీసీసీ చీఫ్ నివాసంలో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మంత్రులు పొన్నం, అడ్లూరి హాజరయ్యారు. ఇద్దరు మంత్రుల కలిసి సమన్వయంతో పనిచేయాలని మహేష్ గౌడ్ సూచించారు. చివరకు మంత్రి అడ్లూరికి పొన్నం క్షమాపణలు చెప్పడంతో వివాదం ముగిసింది.

## సంక్షేమ గురుకులాలకు తాళాలు : కేటీఆర్



**హైదరాబాద్:** యావత్ దేశానికే తలమానికంగా నిలిచిన తెలంగాణ సంక్షేమ గురుకులాలకు అద్దెలు పేరుకుపోయి చివరికి తాళాలు వేసే దుస్థితి రావడం అత్యంత దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. విద్యాశాఖను తన వద్దే పెట్టుకున్న ముఖ్యమంత్రి, గురుకుల భవనాలకు ఏకంగా ఏడాది కాలం నుంచి అద్దెబకాయిలు చెల్లించకపోవడం రేవంత్ రెడ్డి అసమర్థతకు, చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఈ అత్యుత్తమ వ్యవస్థను కుప్పకూల్చి కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలన్న కుట్రలో భాగంగానే సీఎం రేవంత్ ఇదంతా చేస్తున్నట్టు అనుమానం కలుగుతోందని కేటీఆర్ అన్నారు. ఓవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవితవ్యాన్ని అంధకారంలోకి నెడుతున్న ముఖ్యమంత్రి సంక్షేమ గురుకులాలను కూడా సమాధి చేసే పన్నాగాలు చేస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతోపాటు అగ్రవర్ణ పేదలకు కార్పొరేట్ స్థాయి విద్యనందించిన రెసిడెన్షియల్ వ్యవస్థను బలిపెడితే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని రేవంత్ రెడ్డి గుర్తుపెట్టుకుంటే మంచిదని కేటీఆర్ హెచ్చరించారు. రెండేళ్లు నిండకుండానే రెండున్నర లక్షల కోట్ల అప్పులు తెచ్చిన రేవంత్ రెడ్డి, కనీసం గురుకులాల కిరాయి కూడా కట్టకుండా ఆ సొమ్ముతో ఎవరి జేబులు నింపుతున్నాడో లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలోని అన్ని గురుకుల భవనాల అద్దె బకాయిలను విడుదలచేసి విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ గురుకులాలకు తాళాలు వేసే దుస్థితే వస్తే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి తెలంగాణ వ్యాప్తంగా ఈ నిరంకుశ కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరిస్తామని కేటీఆర్ అన్నారు. చిన్నారుల భవితవ్యంతో చెలగాటమా డుతున్న రేవంత్ రెడ్డికి ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

## ఉద్యోగాలు వచ్చిన వారిపై కోపం లేదు..

### గ్రూప్-1పై కవిత సంచలన వ్యాఖ్యలు..



హైదరాబాద్: విద్యార్థుల గోస కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టడం లేదని జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో కొంతమందికి ఉద్యోగాలు ఇవ్వడానికే గ్రూప్-1 పెట్టారా..? అని ఆమె ప్రశ్నించారు. తెలిసో, తెలియకో గత పదేళ్లలో గ్రూప్-1 పెట్టలేదని పేర్కొన్నారు. నిరుద్యోగులతో అధికారంలోకి వచ్చి వాళ్లనే సీఎం రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని మండిపడ్డారు కవిత. ఉద్యోగాలు వచ్చిన అభ్యర్థుల పేపర్లను బయట పెట్టమని పరీక్ష రాసిన అభ్యర్థులు అడుగుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె బుధవారంగన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడారు.. కాంగ్రెస్ ప్రభుత్వం 50 వేల పాత ఉద్యోగాలు ఇచ్చి తాము ఇచ్చినట్లు అబద్ధపు ప్రచారం చేస్తుందని కవిత ఆరోపించారు. ప్రొఫెసర్ హరగోపాల్‌ని స్వయంగా కలుస్తానని ఆమె స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాలని సూచించారు. విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేస్తే కుర్చీలో నుంచి తీసి బయట పడేస్తారని కవిత హెచ్చరించారు. రేపు (గురువారం) ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజా ఆగ్రహానికి గురికావొద్దని హితవు పలికారు. ఉద్యోగాలు వచ్చిన వారిపై కోపం లేదు.. అక్రమంగా తెచ్చుకున్న వారిపైనే తమ కోపమంటూ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు.

## నగరంలో పలు చోట్ల వర్షం..



**హైదరాబాద్:** నగరంలోని వాతావరణంలో అకస్మాత్తుగా మార్పు ఏర్పడింది. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. మరికొన్ని చోట్ల ఎండతో కూడిన వర్షం పడుతుంది. దీంతో రోడ్లపై నీరు నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అయితే ఆకస్మాత్తుగా వాతావరణంలో మార్పులు రావడంతో.. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండాకాలం లోనూ లేనంత వేడిగా ఇప్పుడు వాతావరణం ఉంది. ఈ వేడి ప్రభావంతోనే.. వాతావరణంలో ఇలాంటి మార్పులు చోటుచేసుకున్నా యని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ వాతావరణ మార్పులు దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కోఠి, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, హిమాయత్‌నగర్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, ఫిలింనగర్‌లో మోస్తరు వర్షం కురుస్తోంది.

## బీసీ రిజర్వేషన్లపై విచారణ వాయిదా..



**హైదరాబాద్, అక్టోబర్ 08:** బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో విచారణ వాయిదా పడింది. విచారణ ప్రారంభమైన కాసేపటికే వాయిదా వేస్తూ ధర్మాసనం ప్రకటించింది. తిరిగి ఇవాళ మధ్యాహ్నం 12.30 గంటలకు వాయిదా వేసింది హైకోర్టు. తొలుత విచారణ ప్రారంభమవగానే.. రిజర్వేషన్లపై ప్రస్తుత పరిస్థితి ఏంటని ప్రశ్నించింది హైకోర్టు. సుప్రీంకోర్టులో జరిగిన విచారణపైనా హైకోర్టు ధర్మాసనం ఆరా తీసింది. అన్ని పిటిషన్లను కలిపి ఒకేసారి విచారిస్తామని పేర్కొన్న ధర్మాసనం.. విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేసింది. కాగా, బీసీ రిజర్వేషన్లపై 28 ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలయ్యాయి. అన్ని పిటిషన్లను కలిపి మధ్యాహ్నం హైకోర్టు విచారించనుంది. ప్రభుత్వం తరపున అభిషేక్ సింఘ్వీ కోర్టులో వాదనలు వినిపించనున్నారు.

### తెలంగాణ హైకోర్టు తీర్పుపై ఉత్కంఠ..

కాగా, బీసీ రిజర్వేషన్లపై అంశంపై తెలంగాణ హైకోర్టు తీర్పు ఎలా ఉంటుందో అని తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ తీర్పు స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపనుంది. హైకోర్టు నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికల భవితవ్యం తేలనుంది. సుప్రీంకోర్టు గత తీర్పుల ప్రకారం.. రిజర్వేషన్లు 50 శాతం మించడానికి అవకాశం లేదు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం రిజర్వేషన్లు 67 శాతానికి పెరిగాయి. బీసీలకు 42 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించింది ప్రభుత్వం. హైకోర్టు ఒకవేళ ఈ జీవోను కొట్టివేస్తే స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడే అవకాశం ఉంది.

## సహచర మంత్రులు బాధ్యతాయుతంగా మాట్లాడండి: పీసీసీ చీఫ్

**హైదరాబాద్, అక్టోబర్ 8:** తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య చెలరేగిన వివాదానికి తెరపడింది. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ నివాసంలో ఇరువురు మంత్రుల మధ్య సయోధ్య కుదిరింది. ఈరోజు ఉదయం పీసీసీ చీఫ్ నివాసంలో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో అడ్లూరికి పొన్నం క్షమాపణలు చెప్పారు. దీంతో ఇరువురి మధ్య వివాదం ముగిసింది. దీనిపై పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ చేశారన్న వ్యాఖ్యల పట్ల మరో మంత్రి లక్ష్మణ్ నొచ్చుకోవడంతో యావత్ సమాజం కొంత బాధపడిందన్నారు. మంత్రుల మధ్య జరిగిన సంఘటన కుటుంబ సమస్యగా వెల్లడించారు. జరిగిన సంఘటన పట్ల చింతిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పారన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కష్టపడి పైకొచ్చిన నేతలని తెలిపారు. ఈ సమస్య ఇంతటితో సమసిపోవాలని యావత్ మాదిగ సామాజిక వర్గానికి విజ్ఞప్తి చేశారు పీసీసీ చీఫ్. ఎక్కడ మాట్లాడినా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సహచర మంత్రివర్గానికి కూడా విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల పార్టీ అని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఆశయాన్ని ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహాయంతో కుల సర్వే పారదర్శకంగా నిర్వహించామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మూడు చట్టాలు తీసుకొచ్చామని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలుడు



కోనసీమ అక్టోబర్ 8: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బుధవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలోని బాణసంచా తయారీ పరిశ్రమలో పేలుడు సంభవించింది. దీంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. అలాగే ఈ ఘటనలో మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే రాయవరం బాణసంచా దుర్ఘటనలో శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి మృతి చెందినట్లు గుర్తించారు. ఈ అగ్నిప్రమాదానికి సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది. మరోవైపు ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్కడకు చేరుకుని ఘటనా స్థలాన్ని సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలు సరిహద్దులో ఈ ఘటన జరిగిందన్నారు. 70 సంవత్సరాలుగా బాణాసంచా తయారీలో శ్రీ లక్ష్మీ గణపతి ఫైర్ వర్క్స్ వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తికి అనుభవం ఉందన్నారు. ఆయన కూడా ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. కాసేపట్లోనే హోంమంత్రి వంగలపూడి అనిత ఘటనా స్థలానికి చేరుకుంటారని తెలిపారు. నిబంధనలన్నీ కచ్చితంగా పాటించారని ఇటీవల అధికారుల తనిఖీల్లో వెల్లడయిందన్నారు. అయినప్పటికీ ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.


## ఛలో బస్ భవన్‌కు బీఆర్ఎస్ పిలుపు..




**హైదరాబాద్:** ఛలో బస్ భవన్‌కు బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం బస్ భవన్ దగ్గర బీఆర్ఎస్ నేతలు నిరసన చేపట్టనున్నారు. సిటీలో ఆర్టీసీ ఛార్జీల పెంపును ఖండిస్తూ.. బీఆర్ఎస్ ఆందోళనకు దిగనుంది. ఈ నేపథ్యంలో మెహిదీపట్నం నుంచి బస్ భవన్ వరకు ఆర్టీసీ బస్సులో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఇతర నేతలు ప్రయాణం చేయనున్నారు. బస్ భవన్‌కు చేరుకుని ఆర్టీసీ ఎండీకి ఛార్జీల పెంపుపై మెమోరాండం ఇవ్వనున్నారు. ఈ మేరకు బస్ భవన్ ముందు ధర్నా చేపట్టి సిటీ బస్సుల్లో పెంచిన ఛార్జీలు తగ్గించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేయనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో ఛార్జీలు పెంచిన విషయం తెలిసిందే. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్, ఈ-మెట్రో, ఏసీ సర్వీసుల్లో ఛార్జీలు పెంచింది. ఈ మేరకు మొదటి మూడు స్టేజిలకు రూ.5, 4వ స్టేజి నుంచి రూ.10 అదనపు ఛార్జీలు వసూలు చేస్తోంది. మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో పెంచిన బస్సు ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్ పార్టీ ఛలో బస్ భవన్‌కు పిలుపునిచ్చింది.

# ఫిజిక్స్ నోబెల్ విజేతలు మా వాళ్లే.. గర్వంగా ఉంది

- 2025 భౌతికశాస్త్ర నోబెల్ గెలుచుకున్న ముగ్గురు శాస్త్రవేత్తలు
- జాన్ మార్టినిస్, మైఖేల్ డేవోరే, జాన్ క్లార్క్‌లకు పురస్కారం
- క్వాంటం మెకానిక్స్‌లో కీలక ఆవిష్కరణలకు గాను ఈ గౌరవం
- విజేతలను అభినందించిన గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్



**తొవ్వ డెస్క్ , అక్టోబర్ 08:**
2025 సంవత్సరానికి గాను భౌతికశాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతిని గెలుచుకున్న శాస్త్రవేత్తలు జాన్ మార్టినిస్, మైఖేల్ డేవోరే, జాన్ క్లార్క్‌లను గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అభినందించారు. ఈ విజేతల్లో ఇద్దరు గూగుల్‌కు చెందిన క్వాంటం ఏఐ ల్యాబ్‌తో కలిసి పనిచేసిన వారని ఆయన గుర్తుచేసుకున్నారు. క్వాంటం మెకానిక్స్ రంగంలో వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు ఈ పురస్కారం దక్కింది. ఈ సందర్భంగా సుందర్ పిచాయ్ 'ఎక్స్' వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. "మైఖేల్ డేవోరే, జాన్ మార్టినిస్, జాన్ క్లార్క్‌లకు నోబెల్ బహుమతి గెలుచుకున్నందుకు అభినంద నలు. మైఖేల్ మా క్వాంటం ఏఐ ల్యాబ్‌లో చీఫ్ సైంటిస్ట్ ఆఫ్ హార్డ్‌వేర్ కాగా, జాన్ మార్టినిస్ చాలా ఏళ్లు హార్డ్‌వేర్ టీమ్‌కు నాయకత్వం వహించారు" అని పిచాయ్ తన పోస్టులో పేర్కొన్నారు. 1980వ దశకంలోనే వీరు క్వాంటం మెకానిక్స్‌లో ప్రాథమిక పరిశోధనలకు పునాదులు వేశారని ఆయన ప్రశంసించారు. ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో స్థూల క్వాంటం మెకానికల్ టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్‌ను కనుగొన్నందుకు గాను రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఈ ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతిని ప్రకటించింది. 1984-85 మధ్యకాలంలో వీరు సూపర్ కండక్టర్లతో కూడిన ఒక ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌పై కీలక ప్రయోగాలు చేశారు. తాను ఇటీవలే శాంటా బార్బరాలోని గూగుల్ క్వాంటం ల్యాబ్‌ను సందర్శించానని, అక్కడ జరుగుతున్న పురోగతిని చూసి ఆశ్చర్యపోయానని పిచాయ్ తెలిపారు. గూగుల్ సంస్థలో ఇప్పటివరకు ఐదుగురు నోబెల్ బహుమతి గ్రహీతలు ఉండటం గర్వంగా ఉందని, కేవలం రెండేళ్లలోనే మూడు నోబెల్ బహుమతులు తమ సంస్థతో సంబంధం ఉన్నవారికి రావడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు.ప్రస్తుతం మైఖేల్ డేవోరే గూగుల్ క్వాంటం ఏఐ ల్యాబ్‌లో చీఫ్ సైంటిస్ట్‌గా పనిచేస్తుండగా, యేల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా కూడా ఉన్నారు. జాన్ మార్టినిస్ 2020లో గూగుల్ నుంచి వైదొలగి, 2022లో సొంతంగా క్వాంటం కంప్యూటింగ్ స్టార్టప్‌ను ప్రారంభించారు.

# ఎన్డీఏలో సీట్ల కోసం విభేధాలు



**తొవ్వ ,అక్టోబర్ 08:**
బీహార్ అసెంబ్లీ ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. అయితే ఎన్నికలకంటే ముందే జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ) లో అంతర్గత విభేదాలు బయటపడుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి జితన్ రామ్ మాంఝీ%ఝ% నేతృత్వంలోని హిందుస్తానీ అవామీ మోర్చా తమకు 15 సీట్లు ఇవ్వాల్సిందే అంటూ గట్టిగా పట్టుబడుతోంది. కోరినన్ని సీట్లు కేటాయించకపోతే పోటీకి దూరంగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు.తన రాజకీయ డిమాండ్‌ను మరింత ఆకర్షణీయంగా చూపించడానికి సోషల్ మీడియాలో ఒక కవితను మార్చి పోస్టు చేశారు. అది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ చర్య ఎన్డీఏలోని ఇతర చిన్న మిత్రపక్షాలకు కూడా ధైర్యం ఇచ్చే అవకాశముంది. చిన్నపార్టీలు తమ ప్రాధాన్యతను గుర్తించమని పెద్ద పార్టీలకు సంకేతాలు ఇస్తున్నట్లుగా కనిపిస్తోంది. బీహార్‌లో ఎన్డీఏలో ప్రధాన భాగస్వాములు భారతీయ జనతా పార్టీ జదియు , మరియు హిందుస్తానీ అవామీ మోర్చా. ఈ త్రిపాక్షిక కూటమి కాగితం మీద బలంగా కనిపించినా, భూస్థాయిలో స్థానిక నేతల ఆకాంక్షలు, సీట్ల లెక్కలపై విభేదాలు కూటమి ఐక్యతను పరీక్షిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఇటువంటి అంతర్గత వివాదాలు కూటమి ప్రజాభిప్రాయాన్ని దెబ్బతీయగలవు. కూటమి నాయకత్వం సమయోచితంగా సమసమాధానం కనుక్కోలేకపోతే, ప్రతిపక్షాలు దీనిని పెద్దఎత్తున రాజకీయ ఆయుధంగా మలచుకునే అవకాశం ఉంది. మాంఝీ%ఝ% డిమాండ్ వెనుక రాజకీయ లెక్కలు ఉన్నా, అది ఒక పెద్ద సందేశాన్ని ఇస్తోంది్న చిన్నపార్టీలు ఇకపై పెద్దల నీడలో కాకుండా, సమాన భాగస్వామ్య హక్కులు కోరుతున్నాయి. బీహార్ ఎన్నికల ఫలితాలు ఈ కూటమి అంతర్గత సమీకరణాలపై ఎంత ప్రభావం చూపుతాయో చూడాలి.

# 24 గంటల్లో మరో ముగ్గురు చిన్నారుల మృతి..!





**తొవ్వ ,అక్టోబర్ 8:**
మధ్యప్రదేశ్‌లో దగ్గు సిరప్ మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి. 24 గంటల్లో మరో ముగ్గురు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటి వరకు మధ్యప్రదేశ్‌లో కాఫ్ సిరప్ మరణాలు 20కి చేరాయి. చింద్వారాలో 17 మంది, పంధుర్నాలో ఒకరు, బేతుల్‌లో ఇద్దరు చనిపోయారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో ఐదుగురు పిల్లలు ఇప్పటికీ ప్రాణాప్రాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ కేసులో దగ్గుమందు సిరప్ కంపెనీ యజమానిని అరెస్టు చేయనున్నారు.

ఆయనను పట్టుకునేందుకు రెండు బృందాలు చెన్నై, కాంచిపురం చేరుకున్నాయి. దురదృష్టకర ఘటనలో 20 మంది పిల్లల ప్రాణాలు కోల్పోయారని మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య మంత్రి రాజేంద్ర శుక్లా పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న ఉన్న పిల్లలకు దగ్గు సిరప్ ఇవ్వకుండా భారత ప్రభుత్వం, ఐసీఎంఆర్‌సీ అడ్వైజరీని పాటించాలని శుక్లా కోరారు. శుక్లా నిన్న నాగ్‌పూర్‌ను సందర్శించారు. ఐదుగురు పిల్లలు ఆసుపత్రిలో ఉన్నారని.. వారి కుటుంబాలను కలుసుకున్నట్లు చెప్పారు. పిల్లలను కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ ప్రవీణ్ సోనితో సహా కొంతమంది ప్రైవేట్ వైద్యులు పిల్లలకు కోల్డ్రిఫ్ సిరప్ సిఫారసు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సిరప్ ఇచ్చిన కొద్ది గంటల్లోనే పిల్లల్లో కిడ్నీలు దెబ్బతినడం ప్రారంభించాయి. వారి పరిస్థితి క్షీణించి చనిపోయారు సిరప్‌లో విషపూరిత రసాయనాలు ఉన్నాయని, అవి శరీరంలోకి ప్రవేశించిన తర్వాత కిడ్నీలను దెబ్బతీస్తున్నాయని వైద్య పరీక్షల్లో తేలింది. అందుకే చాలా మంది పిల్లలు కిడ్నీ వైఫల్యంతో మరణించారని.. మరణాల సంఖ్య పెరగడంతో చింద్వారా జిల్లా యంత్రాంగం చర్యలను ముమ్మరం చేసింది. అదనపు కలెక్టర్ ధీరేంద్ర సింగ్ ఇప్పటివరకు 16 మంది చనిపోయారన్నారు. తీవ్రమైన ఆరోగ్య అత్యవసర పరిస్థితి అని, దీన్ని నివారించేందుకు అన్ని స్థాయిల్లో ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఐదు మెడికల్ స్టోర్లను మూసివేసి, అనుమానిత సిరప్ నమూనాలను ల్యాబ్ పరీక్ష కోసం అధికారులు పంపారు. పిల్లలకు ఎలాంటి దగ్గు సిరప్ ఇవ్వకుండా చూడాలంటూ అవగాహన కల్పిస్తున్నారు. ఇదిలా ఉండగా.. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించింది. ఇంతలో దర్యాప్తు పూర్తి పారదర్శకతతో జరుగుతోందని, దోషులను వదిలిపెట్టబోమని బీజేపీ పేర్కొంది.

# ఏపీలో రోడ్ల మరమ్మతుల కోసం రూ.1,000 కోట్లు

- పాలనాపరమైన అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం
- రాష్ట్రవ్యాప్తంగా 274 రహదారులకు మరమ్మతులు
- రాష్ట్ర రహదారులకు రూ.400 కోట్లు కేటాయింపు
- జిల్లా రహదారుల కోసం మరో రూ.600 కోట్లు



**తొవ్వ ,అమరావతి ,అక్టోబర్ 08:**
ఆంధ్రప్రదేశ్‌లో రహదారుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుల కోసం ఏకంగా రూ.1,000 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు నిధులకు పాలనాపరమైన అనుమతులు ఇస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో రాష్ట్రంలోని మొత్తం 274 రహదారులను బాగుచేయనున్నారు. మంజూరైన నిధులను రాష్ట్ర, జిల్లా రహదారుల పనులకు వేర్వేరుగా కేటాయించారు. ఇందులో భాగంగా, రాష్ట్ర రహదారుల (స్టేట్ హైవేస్) పరిధిలోని 108 పనుల కోసం రూ.400 కోట్లు కేటాయించారు. అదేవిధంగా, వివిధ జిల్లాల్లోని ముఖ్యమైన 166 రహదారుల మరమ్మతుల కోసం రూ.600 కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

# ఈసారి మాకే అనుకూలం

- భారత్‌తో యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్న ఖవాజా ఆసిఫ్
- ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను కోరుకోవడం లేదని వ్యాఖ్య
- కానీ ముప్పు పొంచి ఉన్న మాట వాస్తవమని వెల్లడి - పాకిస్థాన్ రక్షణ మంత్రి



**తొవ్వ ,అక్టోబర్ 08**
భారత్‌తో యుద్ధం జరిగే అవకాశాలను కొట్టిపారేయలేమని, ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే తమకు అనుకూల ఫలితాలు ఉంటాయని పాకిస్థాన్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నారు. అయితే, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తాను కోరుకోవడం లేదని ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ముప్పు పొంచివున్న మాట వాస్తవమని ఆయన అన్నారు. ఒకవేళ యుద్ధం జరిగితే గతంలో కంటే మెరుగైన ఫలితాలు పాకిస్థాన్ సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌లో ప్రజలంతా ఒకరితో ఒకరు వాదించుకున్నా, విభేదాలు ఉన్నా భారత్‌తో యుద్ధం వస్తే మాత్రం ఐక్యంగా ఉంటామని ఆయన అన్నారు. చరిత్రను పరిశీలిస్తే భారత్ ఎప్పుడూ ఒకే దేశంగా లేదని ఆయన అభిప్రాయపడ్డారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌ను భారత ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది ఇటీవల హెచ్చరించారు. భారత్ పూర్తిగా సన్నద్ధంగా ఉందని, ఆపరేషన్ సిందూర్ సమయంలో మాదిరి సహనం ఈసారి ప్రదర్శించబోమని ఆయన స్పష్టం చేశారు. పాకిస్థాన్ ప్రపంచ పటంలో నిలబడాలంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాలని, లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచి పెట్టవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలకు పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ పైవిధంగా ప్రతిస్పందించారు.

# బాణసంచా పరిశ్రమలో పేలుడు..

- ఆరుగురు సజీవ దహనం - సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

**తొవ్వ అమరావతి అక్టోబర్ 08:**



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బుధవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రాయవరంలోని గణపతి గ్రాండ్ బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు చోటు చేసుకుంది. దీంతో ఒక్కసారిగా అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ఈ అగ్నికీలల్లో చిక్కుకుని ఆరుగురు సజీవ దహనమయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వివిధ ఆస్ప త్రులకు తరలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో 40 మంది కార్మికులు పని చేస్తున్నట్లు తెలిసింది. పేలుడు ధాటికి బాణాసంచా తయారీ కేంద్రం గోడ కుప్పకూలింది.

**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**
బాణసంచా పేలుడు ఘటనపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలు, వైద్యసాయంపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# జగన్ కోట్ల రూపాయలు దోచుకున్నారు

- మంత్రి నిమ్మల రామానాయుడు

**తొవ్వ ,అక్టోబర్ 08:**
పశ్చిమ గోదావరి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిలో దూసుకెళ్తుందని జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్‌పై విమర్శలు గుప్పించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను బ్యాంకులో జగన్ తాకట్టు పెట్టారని ఆరోపించారు. లబ్ధిదారుల నెత్తిన జగన్ అప్పుల భారం మోపారని విమర్శించారు. టిడ్కో గృహాలలో మిగిలిన పనులు పూర్తి చేసి త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని ఆయన వెల్లడిరచారు. గత వైసీపీ ప్రభుత్వంలో మున్సిపాలిటీల నిధులను సైతం దారి మళ్లించారని మంత్రి రామానాయుడు ఆరోపించారు. పట్టణాలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. జగన్ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి.. కల్తీ లిక్కర్, ఇసుక, గనులు, విలువైన భూముల ద్వారా కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా జగన్ సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకే వైసీపీ కుట్ర రాజకీయాలు చేస్తోందని మంత్రి రామానాయుడు ధ్వజమెత్తారు.



# ఉత్తరాంధ్రపై జగన్ గురి

**విశాఖపట్టణం, అక్టోబరు 8 :**



ఉత్తరాంధ్ర పై జగన్మోహన్ రెడ్డి ఫోకస్ పెట్టారా? పార్టీని బలోపేతంపై దృష్టి పెట్టారా? వచ్చే ఎన్నికలను టార్గెట్ చేసుకున్నారా? అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు ఇప్పుడే వ్యూహం రూపొందిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. 2029 ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో ఎక్కువ సీట్లు తెచ్చుకుంటేనే వైసీపీకి ఛాన్స్ ఉంటుంది. లేకుంటే మాత్రం ఇబ్బందికరమే. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మూడు ఎన్నికలను ఎదుర్కొంది. అందులో రెండింట దారుణ పరాజయం చవిచూసింది. 2019లో జగన్ ప్రభంజనంలో సైతం.. ఉత్తరాంధ్రలో ఆరు సీట్లను గెలుచుకుంది తెలుగుదేశం పార్టీ. కానీ 2024 ఎన్నికలకు వచ్చేసరికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు స్థానాలకే పరిమితమైంది ఉత్తరాంధ్రలో. అందుకే మరోసారి ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే కచ్చితంగా ఉత్తరాంధ్రలో మెజారిటీ సీట్లను కైవసం చేసుకోవాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాయలసీమ అండదండగా నిలుస్తూ వస్తోంది. అక్కడ 70కి పైగా అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 2014లో వైసీపీకి అక్కడ మెజారిటీ వచ్చింది. 2019లో స్విప్ చేసింది. 2024లో మాత్రం ఓ ఏడు స్థానాలకు మాత్రమే పరిమితం అయింది. అందుకే వచ్చే ఎన్నికల్లో రాయలసీమలో మెజారిటీ సీట్లు దక్కించుకొని.. ఉత్తరాంధ్రలో మెరుగైన స్థానాలు పొందితే.. మ్యాజిక్ ఫిగర్ దాటవచ్చు అన్నది జగన్మోహన్ రెడ్డి అంచనా. అయితే ఎట్టి పరిస్థితుల్లో ఉత్తరాంధ్రలో వచ్చే స్థానాలను అనుసరించి మాత్రమే వైసిపి అధికారంలోకి వచ్చే పరిస్థితి ఉంటుంది. అందుకే మూడున్నర ఏళ్ల ముందే ఉత్తరాంధ్రలో పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు. జగన్మోహన్ రెడ్డి. అందుకే సీనియర్లను యాక్టివ్ చేస్తున్నారు.ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అందులో ఓ 20 స్థానాలపై గురిపెట్టినట్లు సమాచారం. ఉత్తరాంధ్రలో సీనియర్లుగా బొత్స సత్యనారాయణ,ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాం, ధర్మాన కృష్ణ దాసు వంటి సీనియర్లు ఉన్నారు. వారితోనే ఈసారి రాజకీయం చేసి ఉత్తరాంధ్రను దక్కించుకోవాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. అందులో భాగంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటు పరాన్ని నిరసిస్తూ నర్సీపట్నంలో ఆందోళన చేయనున్నారు. మొత్తం ఉత్తరాంధ్రను ఆకట్టుకునేలా భారీ ప్లాన్ రూపొందించారు. విశాఖలో భారీగా పరిశ్రమల ఏర్పాటు జరుగుతోంది. పెట్టుబడులు కూడా వస్తున్నాయి. అది కచ్చితంగా కూటమికి ప్లస్ అవుతుంది. అందుకే ఈ పరిశ్రమల ఏర్పాటుకు జరుగు తున్న భూ సమీకరణ, ప్రభుత్వ భూముల కేటాయింపులో జరుగుతున్న లోపాలపై పోరాటం చేయాలని జగన్మోహన్‌రెడ్డి భావిస్తున్నారు. తద్వారా కూటమి దూకుడుకు కళ్లెం వేయడంతో పాటు పార్టీని కొంతవరకు నిలబెట్టవచ్చని భావిస్తున్నారు. ఆయన ప్రయత్నాలు మరి ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

# చేశాం... చెప్పుకోలేకపోయాం

**కడప అక్టోబరు 8 :**

మేం చేసింది చెప్పుకోలేకపోయాం. ప్రజలకు అన్నీ చేశాం కానీ వాటిని ప్రచారం చేసుకోలేకపోయాం.. ఇటీవల జగన్మోహన్ రెడ్డి పార్టీ శ్రేణుల వద్ద వ్యక్తం చేసిన బాధ ఇది. అయితే ఆయన బాధకు కారణం కూటమి ప్రభుత్వం చర్యలు. ఒకవైపు అభివృద్ధి చేస్తోంది. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఎక్కడా ఆర్భాటం చేయడం లేదు. కానీ ప్రజల్లోకి కూటమి ప్రభుత్వం పనులు వెళుతున్నాయి. ప్రజల నుంచి సానుకూలత వస్తోంది. అలాగని వైసీపీ మాదిరిగా వాలంటీర్లు లేరు. ఐ ప్యాక్ లాంటి టీం కూడా లేదు. అయినా సరే కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ప్రజల్లోకి వెళ్తున్నాయి. దీనిని చూసి జగన్మోహన్ రెడ్డి తలలు పట్టుకుంటున్నారు. అయితే అప్పటికీ, ఇప్పటికీ ఆయన తేడా గుర్తించలేకపోవడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లోటు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో వాలంటీర్లు ఉండేవారు. ప్రతి 50 కుటుంబాల బాధ్యతలను చూసేవారు. వారే ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేసేవారు. చక్కటి చిరునవ్వుతో లబ్ధిదారులను పలకరించేవారు. అయితే ఆ పింఛన్ అందిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కాదని.. అసలు ప్రజా ప్రతినిధులతో సంబంధం లేదని.. వాలంటీర్ల చొరవతోనే తమకు పింఛన్లు అందుతున్నాయని భావించేవారు లబ్ధిదారులు. అస్సలు పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు, మంత్రుల జోక్యం ఉండేది కాదు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అలా కాదు. సీఎం చంద్రబాబు ప్రతినెలా ఒకటో తేదీన ఏదో ఒక జిల్లాకు వెళ్తున్నారు. స్వయంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఎమ్మెల్యేలతో పాటు మంత్రుల సైతం ప్రజల్లోకి వెళ్లి పింఛన్లు అందించగలు గుతున్నారు. తద్వారా సంక్షేమ పథకాలు బాగానే అమలు చేస్తున్నామని.. బాధ్యతగా పర్యవేక్షిస్తున్నామని ప్రజలకు సంకేతాలు పంపగలుగుతు న్నారు. ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడంలో కూటమి ప్రభుత్వం సక్సెస్ అయ్యింది. విజయవాడలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటోల్లోనే ప్రయాణించి వేదిక వద్దకు చేరుకున్నారు. వేలాది మంది ఆటో డ్రైవర్ల సమక్షంలో పథకాన్ని ప్రారంభించారు. వీలున్నంతవరకు ఎటువంటి హడావిడి లేకుండా.. ఆటో డ్రైవర్లతో మమేకం అయ్యారు. జిల్లా కేంద్రాల్లో మంత్రులు, నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు కార్యక్రమాన్ని దిగ్విజయంగా జరిపించారు. ప్రజల కోసం కూటమి ప్రభుత్వం ఏదో చేస్తుందన్న ఆలోచనను ప్రజల్లోకి పంపగలిగారు.అయితే జగన్మోహన్ రెడ్డి మాత్రం తాము ఎన్నో చేశామని.. చెప్పుకోలేకపోయామన్న బాధ వెనుక.. కూటమి ప్రభుత్వ చర్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అప్పట్లో ప్రభుత్వ పథకం అమలు చేసిన క్రమంలో మీడియాకు ప్రకటనలు ఇచ్చేవారు. వాలంటీర్లతో పని పూర్తి చేయించేవారు. తాను మాత్రం తాడేపల్లిలో బటన్ నొక్కేవారు. ఎమ్మెల్యేలతో పాటు మంత్రులకు, ముఖ్య నాయకులకు ఎటువంటి పని లేకుండా చేసేవారు. ఆ విషయాన్ని మరిచి తాము అన్నీ చేశామని.. కానీ చెప్పుకోలేకపోయామన్న బాధ పడుతున్నారు. కానీ అసలు విషయాన్ని గ్రహించారు కానీ.. ఆయన ఎట్టి పరిస్థితుల్లో చెప్పుకోలేరు.

# కోనసీమలో కొబ్బరి చెట్లు ఏమౌతున్నాయి..

**కాకినాడ, అక్టోబరు 8 :**

కోనసీమ పేరు చెప్పగానే ముందుగా గుర్తొచ్చేది పచ్చని కొబ్బరి చెట్లు. రోడ్డు.. ఆ రోడ్డుకు ఇరువైపులా ఉండే కొబ్బరి చెట్లు.. వాటి మధ్యన ప్రయాణం.. మనసుకు ఓ ప్రశాంతత. కానీ కోనసీమలో ఇప్పుడు ఆ కొబ్బరి చెట్లు కనుమరుగువతున్నాయి. కన్నకొడుకులా పెంచుకున్న ఆ కొబ్బరి చెట్లు వాడిపోతున్నాయి.. ఆ తర్వాత కూలిపోతున్నాయి. దీంతో ఆ రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు. అసలింతకీ.. కొబ్బరి చెట్లు ఎందుకు కూలుతున్నాయి? దానికి కారణం ఏంటి? అసలేం జరుగుతోంది? సముద్రపు నీరు చేరడంతో కుళ్లిపోతున్న కొబ్బరి చెట్లు.. కోనసీమలోని కొబ్బరి చెట్లు చనిపోతుండటంతో ఇప్పుడు ప్రత్యక్షంగా 10 గ్రామాలు.. పరోక్షంగా 20 గ్రాముల రైతులు నష్టపోతున్నారు. దీనికి కారణం శంకర గుప్తం డ్రైనేజీ. వైనతేయ నదీ పాయలో సముద్రం పోటు సమయంలో వచ్చిన నీరు శంకర గుప్తం డ్రైనేజీ ద్వారా చింతలపూడి గ్రామం వరకు వెనక్కి రావడంతో కొబ్బరి తోటలలో ఆ సముద్రపు నీరు నిలిచిపోతుంది. శంకరగుప్తం మేజర్ డ్రైనేజీ వైనతేయ నది లింక్ ఉంది. శంకరగుప్తం డ్రెయిన్‌కి ప్రధానంగా నాలుగు లింక్ డ్రైనేజీలు ఉన్నాయి. ఒకటి అంతర్వేది, రెండు వేప చెట్టు డ్రెయిన్, పోలవరం డ్రెయిన్, నాలుగు ముత్యాల పేట డ్రెయిన్. ఈ నాలుగు డ్రెయిన్‌ల నుంచి వచ్చే నీరు వల్ల గ్రామాలు దెబ్బతింటున్నాయి.

దీనికి అధ్యయనం చేయడానికి హార్టికల్చర్, అగ్రికల్చర్, బి డబ్ల్యూ టి, స్కాలర్స్, ఫిలాసఫర్స్, సైంటిస్టులు వచ్చారు.. వచ్చారు చూసారు వెళ్లారు గాని ఎవ్వరు నివేదికలు ఇవ్వలేదంటున్నారు గ్రామస్తులు. ONGC రిగ్గుల వేస్ట్ ఆయిల్ సముద్రంలో కలుస్తోందని ఆరోపణలు.. ONGC రిగ్గులు గ్రామాల చుట్టుపక్కల ఎక్కువగా ఉండటంతో వాటి నుండి వచ్చే వేస్ట్ ఆయిల్ అంత సముద్రంలోకి విడిచి పెడుతున్నారని చెబుతున్నారు. సముద్రపు నీరు పూర్తిగా కలుషితమవుతుందన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇకపై తాము ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని చెబుతున్నారు. కోనసీమ నుంచి ఆర్మీలో పని చేస్తూ దేశానికి సేవలందిస్తున్నారు రాజేష్. మరో ఏడాదిలో రిటైర్‌మెంట్ తీసుకుని స్వస్థలానికి వచ్చి తన కొబ్బరి తోట చూసుకుందామనుకునేది ఆయన ఆలోచన. కానీ ఇప్పుడు తన తోటకు వస్తే దుఃఖం వస్తుందంటున్నారు. నేల కూలిన కొబ్బరి చెట్లను చూసి గుండె బరువెక్కుతుందని ఆవేదన చెందుతున్నారు. కొబ్బరిపై ఆధారపడ్డ పరిశ్రమలు మూతపడ్డాయన్న రైతులు.. కోనసీమ కొబ్బరి రైతులు ఇలాంటి గడ్డు



పరిస్థితులను ఎదుర్కొంటున్నారని 2014 ఇప్పటివరకు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు అదే గ్రామానికి చెందిన దొరబాబు అనే వ్యక్తి. కొబ్బరికాయలు ఎక్స్‌పోర్ట్ చేయడం.. కొబ్బరి తాడును తయారు చేయడం.. ఇలా అనేక పరిశ్రమలు ఇప్పుడు ఈ ప్రాంతంలో మూతపడ్డా యంటు న్నారు. ఆదాయం లేక చాలా మంది పూర్తిగా గ్రామాన్ని వదిలి వలస వెళ్లే పరిస్తితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఆయన. రాజోలు నియోజకవర్గంలో అనేక గ్రామాలలో **ONGC** రిగ్గులు ఉన్నాయి. వీటి నుంచి వచ్చిన వ్యర్థ ఆయిల్‌ని సముద్రంలోకి వదులుతున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం సముద్ర నీరు కూడా పూర్తిస్థాయిలో రంగు మారిపోయిందని.. విషపూరితంగా మారిపోయిందంటున్నారు. ఆ నీరే కొబ్బరి చెట్ల మధ్యలోకి రావడం వల్లే పూర్తిస్థాయిలో కుళ్ళిపోతున్నాయని చెబుతున్నారు. న్యాయం జరగకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామన్న రైతులు కోనసీమ కొబ్బరి చెట్ల వినాశనానికి కారణమవుతున్న శంకరగుప్తం డ్రెయిన్‌కి సంబంధించి పూర్తిగా విశ్లేషణ చేపడితే.. ఇది మొత్తం 22 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. 1990లలోనే ఈ కాలువ నిర్మాణానికి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయితే 2014లో చేపట్టిన డ్రెడ్జింగ్ పనులు ఇప్పుడు తమకు శాపాలుగా మారాయి అంటున్నారు ఈ ప్రాంతవాసులు. 16 కిలోమీటర్లు డ్రెడ్జింగ్ చేయాల్సింది.. 8 కిలోమీటర్లు చేసి వదిలేశారని చెబుతున్నారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో చర్యలు చేపడితే సమస్య పరిష్కారమవుతుందని.. లేదంటే తాము ఇక పోరు బాట పడతామని చెబుతున్నారు.

# విజయ్‌తో కమలం సంప్రదింపులు

**చెన్నై, అక్టోబరు 8 :**

కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తొక్కిసలాట ఘటన తర్వాత తమిళ వెట్రి కళగం (టీవీకే) అధినేత, నటుడు విజయ్‌తో బీజేపీ సంప్రదింపులు జరిపినట్టు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తన అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి కాషాయ పార్టీ విజయ్ భారీ అభిమానులను వినియోగించుకోడానికి కృషి చేస్తోందని వర్గాలు సూచించాయి. టీవీకే నాయకత్వంతో సంప్రదింపులు జరిపిన బీజేపీ సీనియర్ నేత ఒకరు.. డీఎంకే అన్యాయంగా విజయ్‌ను టార్గెట్ చేసుకుంటే ఆయన ఒంటరికాదని చెప్పినట్టు తెలుస్తోంది. మరోవైపు, ఈ ఘటనపై సీబీఐ విచారణ కోరుతూ టీవీకే వేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది.డీఎంకేను ఇరుకునపెట్టాలని భావిస్తోన్న బీజేపీ.. తన రాజకీయ భవిష్యత్తును అగమ్యగోచరంలో పడేసిన కరూర్ తొక్కిసలాట ఘటన నుంచి బయటపడటానికి విజయ్ కాస్త ఓర్పు పాటించాలని సలహా ఇచ్చినట్టు సమాచారం. మరోవైపు, ఈ విషాద ఘటన అనంతరం తనకు మద్దతు తెలిపిన రాజకీయ నాయకులకు విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, బీజేపీతో పాటు కాంగ్రెస్ కూడా టీవీకేతో సంప్రదింపులు జరిపిందని సమాచారం. ఇది, రాష్ట్ర రాజకీయాల్లో దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయిస్తున్న ద్రావిడ ప్రధాన పార్టీలు డీఎంకే, అన్నాడీఎంలకు గండికొట్టి జాతీయ పార్టీలు తమ ఉనికిని చాటుకోడానికి ఈ పరిణామాన్ని అవకాశంగా చూస్తున్నాయని సూచిస్తుంది.పరిణామాలు తమిళనాడు రాజకీయ ముఖచిత్రాన్నే మార్చే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తానని ప్రకటించిన విజయ్.. తాజా పరిణామాలో తన వ్యూహాన్ని మార్చుకునే అవకాశం ఉంది. కాగా, ఇటీవల తమిళనాడు బీజేపీ ఇంఛార్జ్‌గా నియమితులైన జయ్ పాండా రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగా తమిళనాడులోని బీజేపీ సీనియర్ నేతలు, పదాధికారులతో సమావేశం కానున్నారు.అటు, ఢిల్లీలో ఉన్న తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై.. కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన వివరాలు, దాని రాజకీయ ప్రభావంపై పార్టీ నాయకులకు నివేదిక ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో డీఎంకేపై వ్యతిరేకత స్పష్టంగా ఉంటుందని భావిస్తోన్న బీజేపీ.. విపక్ష ఓట్ల చీలిపోకూడదనే వ్యూహంతో టీవీకేపై దృష్టి సారిస్తున్నారు.కాగా, కరూర్‌లో సెప్టెంబరు 27న జరిగిన ర్యాలీలో తొక్కిసలాట చోటుచేసుకుని 41 మంది చనిపోయిన ఘటనలో డీఎంకే ప్రభుత్వంపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ర్యాలీకి తగిన స్థలాన్ని కేటాయించలేదని, అవసరమైన భద్రత కల్పించలేదంటూ విమర్శలు వచ్చాయి. సీసీటీవీ ఫుటేజీలు, సంబంధితశాఖ అధికారుల వివరణతో ప్రభుత్వం కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేసింది. గతంలో ఎన్నడూ ఇటువంటి ఘోరమైన సంఘటన జరగకపోవడంతో టీవీకేను ఇది సందిగ్ధంలో పడేసింది. తొక్కిసలాట సమయంలో టీవీకే కార్యకర్తలు సహాయక చర్యలు చేపట్టలేదని, బాధితులను పరామర్శించకుండానే విజయ్ చెన్నైకు వెళ్లిపోయినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

# తెలంగాణలో టీడీపీ...భారీ స్కెచ్

**హైదరాబాద్, అక్టోబరు 8 :**

తెలంగాణలోపార్టీ బలోపేతం పై చంద్రబాబు ఫోకస్ పెట్టారా? మెల్లగా పార్టీని యాక్టివ్ చేయాలని చూస్తున్నారా? స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధపడుతున్నారా? గ్రేటర్ విశాఖలో సత్తా చాటాలని చూస్తున్నారా? అంటే అవుననే సమాధానం వస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా ఇలానే ఉన్నాయి. కొద్ది రోజుల కిందట తెలంగాణ నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇప్పటికిప్పుడు కాకుండా.. క్రమేపి పార్టీని యాక్టివ్ చేయాలని చూస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా వివిధ కారణాలతో పార్టీని వీడిన వారిని రప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా బిఆర్ఎస్ లో ఉన్న పూర్వ టిడిపి నేతలతో మంతనాలు చేస్తున్నట్లు సమాచారం. అదే జరిగితే తెలుగుదేశం పార్టీ తెలంగాణలో యాక్టివ్ కావడం ఖాయం. అయితే మొన్నటి చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్ ఉద్దేశం కూడా అదేనని తెలుస్తోంది.అయితే ముందుగా తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్ష స్థానాన్ని భర్తీ చేస్తారని తెలుస్తోంది. 2023 తెలంగాణ ఎన్నికలకు ముందు తెలంగాణ టిడిపి అధ్యక్షుడిగా ఉన్న కాసాని జ్ఞానేశ్వర్ రాజీనామా చేశారు. అప్పటినుంచి టీటీడీపీ అధ్యక్ష పదవి ఖాళీగా ఉంది. తెలంగాణలో ఎన్నికలు జరిగిన సమయానికి ఏపీలో చంద్రబాబు అరెస్టయ్యారు. 52 రోజులపాటు రిమాండ్ ఖైదీగా ఉండి పోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో వ్యూహాత్మకంగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల బరి నుంచి తప్పుకుంది తెలుగుదేశం పార్టీ. అయితే చంద్రబాబు నిర్ణయాన్ని విభేదించారు కాసాని జ్ఞానేశ్వర్. అప్పటికే తెలంగాణలో తెలుగుదేశం పార్టీని యాక్టివ్ చేయగలిగారు జ్ఞానేశ్వర్. పోటీ నుంచి తప్పుకోవడంతో జ్ఞానేశ్వర్ పునరాలోచనలో పడ్డారు. కెసిఆర్ పిలుపుతో బి ఆర్ఎస్ లో చేరారు. ఆ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. కానీ అప్పటి నుంచి టీటీడీపీ అధ్యక్ష పదవిని భర్తీ చేయలేదు చంద్రబాబు.అయితే ఇప్పుడు అధ్యక్ష పదవి కోసం ముగ్గురు నేతల మధ్య పోటీ జరుగుతున్నట్లు సమాచారం. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీలో ఒక వెలుగు వెలిగారు కృష్ణారెడ్డి. తరువాత టిడిపిని వీడి గులాబీ కండువా కప్పుకున్నారు. కానీ ఏపీలో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత తీగల కృష్ణారెడ్డి గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పారు. ఏకంగా సైకిల్ ఎక్కేశారు. మరోవైపు మాజీ మంత్రి బాబు మోహన్ సైతం ముందుగా గులాబీ పార్టీలోకి వెళ్లారు. తరువాత బిజెపిలో చేరారు. చివరకు పాత పార్టీ సైకిల్ ఎక్కేశారు. అయితే ఈయన సైతం అధ్యక్ష పదవి ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అరవింద్ కుమార్ గౌడ్ ఆ పదవి కోసం ఎదురుచూస్తున్నారు. ఈయన సీనియర్ నేత దేవేందర్ గౌడ్ మేనల్లుడు. పార్టీలో సుదీర్ఘకాలం కొనసాగుతూ వచ్చారు. అయితే ఈ ముగ్గురు నేతల్లో ఎవరికో ఒకరికి పదవి ఇవ్వడం ఖాయమని తెలుస్తోంది.మరోవైపు గులాబీ పార్టీ నుంచి చాలామంది నేతలు టిడిపి వైపు వస్తారని కూడా ప్రచారం జరుగుతోంది. మొన్న ఆ మధ్యన పార్టీ హైకమాండ్తో విభేదించిన కేసీఆర్ కుమార్తె కవిత టిడిపిలో చేరుతారని తెగ ప్రచారం నడిచింది. మరోవైపు మాజీ మంత్రి మల్లారెడ్డి, నామా నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు వంటి నేతల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ కు చెందిన కమ్మ సామాజిక వర్గం నేతలు ఎక్కువగా టిడిపి వైపు టర్న్ అవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అందుకే చంద్రబాబు సైతం స్థానిక రాజకీయాలను అనుసరించి అడుగులు వేస్తున్నట్లు సమాచారం. స్థానిక సంస్థలతోపాటు జీవీఎంసీ ఎన్నికల్లో ఉనికి చాటుకొని.. క్రమేపి పార్టీని అభివృద్ధి చేసి పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఆయన ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

# మూడు పార్టీలనూ "లోకల్" ముంచేస్తుందా?




**విజయవాడ, అక్టోబరు 8 :**
ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలకు పెద్దగా సమయం లేదు. మరో మూడు నెలల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు విడతల వారీగా ఎన్నికలు జరగడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ సిద్ధమయింది. 2026 జనవరి లేదా మార్చి నెలల్లోనే ఈ ఎన్నికలు ఉండే అవకాశముంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి అడ్వాంటేజీ ఉంటుంది. అంగబలం, అర్థబలం సమృద్ధిగా ఉండటంతో పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ తమ ప్రాంతంలో కూడా గెలిస్తే మేలు జరుగుతుందని ప్రజలు సహజంగా భావిస్తారు. అందుకే లోకల్ బాడీ ఎన్నికల్లో ఎక్కువగా అధికార పార్టీకి అనుకూలంగా ఫలితాలు వస్తూ ఉంటాయి.. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉన్న నేతల మధ్య విభేదాలు ఎన్నికల ఫలితాలను ఏ రకమైన ప్రభావానికి గురి చేస్తాయోనన్న ఆందోళన అందరిలోనూ ఉంది. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన నేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ అగ్రనేతలు మాత్రం కలసికట్టుగానే ఉన్నారు. కానీ నేతల మధ్యనే సఖ్యత లేదు. అది వాస్తవం. ఏ పార్టీ నియోజకవర్గంలో అధికారంలో ఉంటే మిగిలిన కూటమి పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నేతలు వ్యతిరేకిస్తున్నారు. నామినేటెడ్ పదవులు తమకు దక్కకపోవడంతో పాటు పనుల కేటాయింపులో కూడా తమకు ప్రాధాన్యత దక్కడం లేదన్న అసహనం, అసంతృప్తి ఎక్కువగా కనిపిస్తుంది. మద్యం షాపులు, ఇసుక, కాంట్రాక్టు పనులు వంటి విషయాల్లో తమకు అన్యాయం జరుగుతుందని కూటమి నేతలు భావిస్తున్నారు.? అసంతృప్తి.. అసహనం... కూటమి ప్రభుత్వం ఇటు సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. మరొకవైపు అభివృద్ధిని కూడా పరుగులు పెట్టిస్తున్నారు. కానీ నేతల మధ్య సమన్వయం లేమి కూటమి కొంపముంచు తుందేమోనన్న ఆందోళన ఎక్కువగా కనిపిస్తుంది. ఉదాహరణకు పిఠాపురం నియోజకవర్గమే తీసుకుంటే అక్కడ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే అక్కడ జనసేనలోనే రెండు నుంచి మూడు గ్రూపులున్నాయి. ఇక టీడీపీ, జనసేన క్యాడర్ మధ్య పొసగడం లేదు. ఇలా దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి ఉంది. లోకల్ ఎన్నికల్లో దెబ్బతీసి ఎమ్మెల్యేను అధినాయకత్వం ముందు దోషిగా నిలబెట్టాలన్న ప్రయత్నం జరుగుతున్నట్లు కనిపిస్తుందంటున్నారు. అదే జరిగితే కూటమిలోని మూడు పార్టీలకూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వెన్నుపోట్లు తప్పవని కూటమి పార్టీ నేతలే అంటుండటం విశేషం. అయితే మరో మూడు నాలుగు నెలల సమయం ఉండటంతో అప్పటికి పరిస్థితి చక్కబడే అవకాశాలున్నాయన్న ఆశలు మాత్రం నేతల్లో కనిపిస్తుంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# విశాఖపట్నంలో ఓజీ కారవాన్ బస్సు

## స్టార్ హెూటల్ రేంజ్‌లో సౌకర్యాలు

విశాఖపట్టణం, అక్టోబరు 8 : ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ, ఓజీ డ్రీమ్‌లైనర్ సంస్థ కలిసి విలాసవంతమైన కారవాన్ బస్సులను త్వరలో ప్రవేశపెడుతున్నాయి. విశాఖపట్నం నుండి అరకు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు ఇవి అద్భుతమైన అనుభూతిని ఇస్తాయి. ఏసీ పడక గదులు, వంటగది, టీవీ, వైఫై వంటి సౌకర్యాలతో రెండు కుటుంబాలు సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చు. ఒక్కో వ్యక్తికి రూ. 2,500తో రాత్రి బసతో కూడిన ప్యాకేజీలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి.ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ, ఓజీ డ్రీమ్‌లైనర్ సంస్థ కలిసి కారవాన్ బస్సులను త్వరలో అందుబాటులోకి తెస్తున్నాయి. ఈ బస్సులు నగర ప్రజలకు అద్భుతమైన పర్యాటక అనుభూతిని ఇస్తాయి. వీటిలో విలాసవంతమైన సౌకర్యాలు ఉంటాయి. పర్యాటక శాఖతో ఒప్పందం తర్వాత నిర్వాహకులు ప్యాకేజీలు ప్రకటిస్తారు.

ఈ ఓజీ కారవాన్ బస్సులు స్టార్ హెూటళ్లలా ఉంటాయి.. వీటిలో ఏసీ పడకగదులు, విశాలమైన హాళ్లు, వంటగది, మరుగుదొడ్డి వంటి అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ప్రయాణికులు ఎంతో సౌకర్యంగా ప్రయాణించవచ్చు. విశాఖపట్నం నుంచి అరకు, పాడేరు, వంజంగి, లంబసింగి, అరసవల్లి, శ్రీకాకుళం, సీతంపేట, అన్నవరం, రాజమహేంద్రవరం, కాకినాడ వంటి అనేక పర్యాటక ప్రాంతాలను ఈ కారవాన్ బస్సులలో సందర్శించవచ్చుఈ ఓజీ కారవాన్‌లను విశాఖలో పర్యాటకులను ఆకర్షించడానికి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ఓజీ కారవాన్‌లో రెండు కుటుంబాలు ప్రయాణించొచ్చు. అందుకు అవసరమైన వసతులు ఈ కారవాన్‌లలో అందుబాటులో ఉన్నాయి. ఈ ఓజీ బస్సులో కూర్చోవడానికి సోఫాలు, పడకలు, మ్యూజిక్ సిస్టం, వినోదం కోసం రెండు టీవీలు, వైఫై, నచ్చిన ఆహారం వండుకోవడానికి వంటగది కూడా ఉంటుంది. ఒక్కో వ్యక్తి రూ. 2,500 చెల్లిస్తే ఈ ఓజీ బస్సులో.. రాత్రి బసతో పాటు రోజంతా ప్రయాణించొచ్చు. పర్యాటకశాఖతో జరిగే ఒప్పందం మేరకు ఈ ధర ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు.ఎవరైనా పర్యాటక ప్రదేశాల సందర్శించాలనుకుంటే ఈ కారవాన్ బస్సులు చాలా సౌకర్యంగా ఉంటాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధుమిత్రులతో కలిసి జాలీ ట్రిప్ వేయొచ్చు. ఈ ఓజీ బస్సులో ఒకేసారి 10 నుంచి 15 మంది వెళ్లిరావొచ్చని చెబుతున్నారు. ఈ ప్యాకేజీలో ఉదయం టిఫిన్ నుంచి రాత్రి భోజనం వరకు సమకూరుస్తారు. అంతేకాదు ఒకవేళ ఎవరికైనా ప్రత్యేకంగా వంటకాలు కావాలంటే ముందుగా చెబితే చేయిస్తాము అంటున్నారు. ఈ ఓజీ కారవాన్‌లో పైలట్‌తో పాటుగా వచ్చిన వారికి పర్యాటక ప్రాంతాల గురించివివరించేందుకు గైడ్ కూడా అందుబాటులో ఉంటారు.త్వరలోనే ఈ ఓజీ కారవాన్ ప్యాకేజీలు అందుబాటులోకి తెస్తామని చెబుతున్నారు నిర్వాహకులు. ఒకవేళ ఎవరికైనా ఆసక్తి ఉంటే.. **www.ojicaravans.com** 94400 30707 నంబరులో సంప్రదించాలని సూచిస్తున్నారు. విశాఖపట్నం నుంచి కారవాన్ టూరిజానికి నిబంధనలు రూపొందిస్తున్నామని చెబుతున్నారు. ఈ కారవాన్ టూరిజం ప్యాకేజీ ధరలపై త్వరలో క్లారిటీ వస్తుందని.. ఏ ప్రాంతానికి వెళితే, ఎంత ధర చెల్లించాలో నిర్ణయించాలనేది చర్చిస్తున్నామంటున్నారు. ఈ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని చెబుతున్నారు. విశాఖపట్నం మాత్రమే కాదు మరికొన్ని పర్యాటక ప్రాంతాల్లో కూడా ఈ కారవాన్ టూరిజం అందుబాటులోకి రానుంది. త్వరలోనే దీనిపై పూర్తిస్థాయిలో క్లారిటీ రానుంది.

# ఏపీలో 'స్క్రబ్‌టైఫస్' కే కలకలం



**నెల్లూరు, అక్టోబరు 8 :**
ఆంధ్రప్రదేశ్‌లో 'స్క్రబ్ టైఫస్' కేసులు కలకలం రేపుతున్నాయి. నల్లిని పోలిన చిన్న కీటకం కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. ముఖ్యంగా చిన్న పిల్లలపై దీని ప్రభావం అధికం. జ్వరం, కండరాల నొప్పి, తలనొప్పి వంటి లక్షణాలుంటాయి. చికిత్స ఆలస్యమైతే మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌కు దారితీసి ప్రాణాంతకం కావచ్చు. నెల్లూరు జిల్లాలో నాలుగు కేసులు నమోదయ్యాయి. పరిసరాల శుభ్రత, ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి. లక్షణాలు కనిపిస్తే రక్త పరీక్ష చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.ఏపీలో 'స్క్రబ్ టైఫస్' కేసులు నమోదయ్యాయి.. నల్లిని పోలిన ఒక చిన్న కీటకం కుడితే ఈ స్క్రబ్‌టైఫస్ బారినపడతారు. ఇది ఇళ్లలో పెద్దవాళ్లు, పిల్లలను కుడుతుంది.. కాకపోతే ముఖ్యంగా చిన్న పిల్లలపై దీని ప్రభావం ఎక్కువగా ఉంది. ఇప్పటికే డెంగీ, మలేరియా వంటి జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు స్క్రబ్ టైఫస్ టెన్షన్ మొదలైంది. కొండ ప్రాంతాల్లో కనిపించే ఈ కీటకాలు ఇప్పుడు అన్ని చోట్లకూ వ్యాపించాయంటున్నారుఒక కీటకం కుడితే నల్ల మచ్చ వస్తుంది. ఏడు రోజుల పాటు జ్వరం ఉంటుంది. డెంగీ లాగే కండరాల నొప్పి, తలనొప్పి, జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. చికిత్స ఆలస్యం అయితే మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్‌కు దారి తీసి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. లక్షణాలను బట్టి యాంటీ బయోటిక్స్‌తో నయం చేయవచ్చు. కొన్నిసార్లు ఐసీయూ చికిత్స కూడా అవసరం అవుతుందని చెబుతున్నారు వైద్యులు.తాజాగా నెల్లూరు జిల్లాలో స్క్రబ్‌టైఫస్ కేసులు నమోదయ్యాయి. కావలి, వెంకటేశ్వరపురం, మనుబోలు, ఎన్టీఆర్‌నగర్‌లో ఈ ఏడాది 4 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. ముందస్తు జాగ్రత్తగా స్క్రబ్ టైఫస్ బాధిత కుటుంబ సభ్యులతో పాటుగా ఆ చుట్టుపక్కల వారికి ఈ వ్యాధి లక్షణాలు ఉన్నాయా? అని టెస్ట్‌లు చేస్తున్నారు. ఒకవేళ ఎవరికైనా స్క్రబ్ టైఫస్ లక్షణాలను గుర్తిస్తే వెంటనే వారి బ్లడ్ శాంపిల్స్ సేకరించి జీజీహెచ్‌కు పంపుతున్నారు. ఈ టైఫస్ జ్వరం నిర్ధారణ కోసం వీల్‌ఫెలిక్స్ పరీక్ష చేయాలని సూచిస్తున్నారు డాక్టర్లు.ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని..

ముఖ్యంగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ఒకవేళ ఇంట్లో పాత దిండ్లు, పరుపులు, మంచాలు, పరుపులు వంటివి తీసివేయడం మంచిదంటున్నారు. ఈ కీటకాలు రాత్రి వేళల్లో ఎక్కువగా దాడి చేసే అవకాశం ఉందంటున్నారు. అందుకే పిల్లల కాళ్లు చేతులు కప్పి ఉంచేలా దుస్తులు వేయాలని సూచిస్తున్నారు. చెట్లు ఎక్కువగా ఉన్న చోట్ల, వ్యవసాయ భూముల పక్కన నివసించే వారిపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఈ పురుగులు ఎక్కువగా పొట్ట, బుగ్గలు, ఛాతి, పాదాలప కుడుతాయి అంటున్నారు.స్క్రబ్ టైఫస్ విషయంలో భయం అవసరం లేదని.. ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామంటున్నారు డాక్టర్లు. ఒకవేళ ఎవరికైనా జ్వరం వచ్చి తగ్గకపోతే డెంగీ, టైఫాయిడ్, మలేరియాగా భావించి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరుతున్నారు డాక్టర్లు. ఒకవేళ మచ్చలు కనిపిస్తే వెంటనే స్క్రబ్ టైఫస్ నిర్ధారించేందుకు రక్త పరీక్ష చేయించుకోవాలని సూచిస్తున్నారు. స్క్రబ్ టైఫస్ ప్రాణాంతకం కాదని.. ప్రజలకు ఆందోళన అవసరం లేదని.. కానీ ముందస్తు జాగ్రత్తలు కూడా అవసరం అంటున్నారు.

# నేను దేవుడ్ని...

## అమ్మను దేవుడి దగ్గరకు పంపించా...

**కడప, అక్టోబరు 8 :**
వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తల్లిని చంపిన యశ్వంత్ రెడ్డి మానసిక పరిస్థితిపై అనుమానాలు తలెత్తుతున్నాయి. యశ్వంత్ రెడ్డి మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. పోలీసుల విచారణలో కూడా తాను దేవుడిని అని.. ఆ విషయం అమ్మ నమ్మకపోవటంతోనే తల్లిని దేవుడి వద్దకు పంపించానంటూ యశ్వంత్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. అల్లారుముద్దుగా పెంచిన కొడుకే తన పాలిట కాలయముడు అవుతాడని ఊహించలేకపోయిన ఆ కన్నతల్లి ఉదంతం ఇప్పుడు సంచలనంగా మారింది.వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో తల్లిని చంపిన తనయుడి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. యశ్వంత్ కుమార్ రెడ్డి మానసిక స్థితి సరిగా లేదని వార్తలు వస్తున్నాయి. అయితే తాను దేవుణ్ని అంటే నమ్మలేదనే తల్లిని చంపినట్లు యశ్వంత్ కుమార్ రెడ్డి పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే..ప్రొద్దుటూరులోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన విజయభాస్కర్ రెడ్డి, లక్ష్మీదేవి దంపతుల ఏకైక సంతానం యశ్వంత్ కుమార్ రెడ్డి. లక్ష్మీదేవి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఒక్కడే కొడుకు కావటంలో యశ్వంత్ కుమార్ రెడ్డిని గారాబంగా పెంచారు ఆ దంపతులు. కొడుకును బాగా చదివించి ప్రయోజకుడిని చేయాలనే ఉద్దేశంతో చెన్నైలో ఇంజినీరింగ్ చదివించారు. ఇంజనీరింగ్ పూర్తి కాగానే యశ్వంత్ కుమార్ రెడ్డి.. ఉద్యోగాన్వేషణలో భాగంగా హైదరాబాద్‌కు పంపించారు. ప్రతి నెలా ఖర్చుల కోసం డబ్బులు పంపించేవారు.ఈ క్రమంలోనే ఈ మధ్యనే ఒకసారి మూడు వేలు పంపించగా.. కొన్ని రోజులకే మరో పదివేలు కావాలని యశ్వంత్ రెడ్డి అడగటంతో తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో తల్లి మీద కోపం పెంచుకున్న యశ్వంత్ రెడ్డి.. ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరు చేరుకుని తల్లితో గొడవ పడ్డాడు. తండ్రిని గదిలో బంధించి తల్లి గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. కూరగాయలు కోసే కత్తితో కన్నతల్లి గొంతుకోసిన యశ్వంత్ రెడ్డి.. ఆ తర్వాత లక్ష్మీదేవి వరండాలోకి ఈడ్చుకుని వచ్చి పడేశాడు. ఆ తర్వాత తలుపులు బిగించుకుని టీవీలో పాటలు వింటూ కూర్చున్నాడు.మరోవైపు ఉద్యోగ ప్రయత్నాల కోసం హైదరాబాద్ చేరిన యశ్వంత్ రెడ్డి.. ఇన్నేళ్లు హైదరాబాద్‌లో ఒక్కడే రూమ్‌లోఉంటున్నట్లు బంధువులు చెప్తున్నారు. ప్రతినెలా యశ్వంత్ ఖర్చుల కోసం ఇంటి నుంచి డబ్బులు పంపేవారని చెప్తున్నారు. అయితే యశ్వంత్ మానసిక స్థితిలో మార్పును గమనించిన అతని తల్లిదండ్రులు.. ఇంటికి వచ్చేయాలని కోరినా అతను వినిపించుకోలేదంటున్నారు. కేవలం డబ్బుల కోసం మాత్రమే యశ్వంత్ తన తల్లిదండ్రులకు ఫోన్ చేసేవాడని తెలిసిందిమరోవైపు హైదరాబాద్ నుంచి ఆదివారం ఉదయం ప్రొద్దుటూరులోని ఇంటికి చేరుకున్న యశ్వంత్ రెడ్డి.. వచ్చిన వెంటనే తల్లితో గొడవ పడినట్లు తెలిసింది. తాను దేవుణ్ని అని.. అడిగినప్పుడు డబ్బులు ఇవ్వాలంటూ లక్ష్మీదేవితో గొడవపడినట్లు సమాచారం. పోలీసుల విచారణలోనూ యశ్వంత్ రెడ్డి ఇదే విషయాన్ని చెప్పినట్లు తెలుస్తోంది. తాను దేవుడిని అంటే తల్లి నమ్మడం లేదని.. అందుకే దేవుడి వద్దకు పంపించానని యశ్వంత్ చెప్పినట్లు సమాచారంఈ క్రమంలోనే యశ్వంత్ రెడ్డి మానసిక స్థితిగతులపై పోలీసులు దృష్టి సారించినట్లు సమాచారం. హైదరాబాద్‌లో అతను ఉన్న పరిస్థితులు.. గతంలో మానసిక సమస్యలతో ఎప్పుడైనా ఇబ్బందులు పడ్డారా అనే విషయాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది.మొత్తంగా ఒక్కగానొక్క కొడుకు అంటూ గారాబంగా పెంచిన కన్నతల్లినే.. ఓ కొడుకు అమానుషంగా గొంతుకోసి హత్య చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది.

# సంక్షేమ పథకాలు కలిసొస్తాయా

**విజయవాడ అక్టోబరు 8 :**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తిరిగి ఎన్నికలు ఎప్పుడు జరిగినా గట్టెక్కిస్తాయని భావిస్తున్నట్లుంది. అందుకే ఆయన పదే పదే సంక్షేమం పదాన్ని వల్లె వేస్తున్నారు. అభివృద్ధి అన్న మాట కంటే ఎక్కువగా సంక్షేమం అనే పదమే ఎక్కువ సార్లు ఆయన నోట వినిపిస్తుంది. గత పదిహేను నెలల కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసింది. పింఛన్లను నాలుగు వేల రూపాయలకు పెంచడంతో పాటు, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, మహిళలకు ఉచిత బస్సు, ఆటో డ్రైవర్లకు పదిహేను వేల రూపాయలు వంటి పథకాలను అమలు చేశారు. వీటితో పాటు తల్లికి వందనంతో పాటు అన్నదాతకు అండగా నిలుస్తూ అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేశారు. సంక్షేమం విషయంలో చంద్రబాబు ను ఎవరూ తప్పుంట్టలేరు. గత మూడు దఫాలుగా... నిజానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గత మూడు దఫాలు సంక్షేమం అమలు చేసిన దానికంటే ఎక్కువగా ఈ టర్మ్ లో అమలు చేసి చూపుతున్నారు. గతంలో మూడు దఫాలు ఆయన విజన్ తో పనిచేసేవారు. సంక్షేమం అనేది ఆయనకు లీస్ట్ ప్రయారిటీగా ఉండేది. రాష్ట్ర భవిష్యత్ అంటూ సుదూర దృష్టితో ఆలోచించి నిర్ణయాలు తీసుకునే వారు. కానీ ఈసారి మాత్రం చంద్రబాబు నాయుడు అందుకు భిన్నంగా కనిపిస్తున్నారు. కార్యకర్తల సంక్షేమాన్ని కూడా పూర్తిగా పక్కన పెట్టేశారు. ఇప్పుడంతా సంక్షేమ మంత్రమే ఆయన నోటి నుంచి వినిపిస్తుండటం ఒకింత పార్టీ నేతలకు ఆశ్చర్యం కలిగిస్తుంది. చంద్రబాబు నాయుడు తనపై ఉన్న అపవాదును చెరిపేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు కనిపిస్తుంది. ఎందుకంటే చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయరు అన్న వారి నోళ్లను మూయించడానికే సంక్షేమాన్ని భారమైనా భుజానకెత్తుకున్నారంటున్నారు. అయితే సంక్షేమాన్ని అమలు చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే రెండోసారి విజయం సాధించారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోనూ అనేక సంక్షేమ పథకాలను ఇబ్బడి ముబ్బడిగా అమలు చేసిన కేసీఆర్ ను కూడా ప్రజలు ఓడించారు. ఇక గత ప్రభుత్వ హయాంలో దాదాపు 2.75 లక్షల కోట్ల రూపాయలను లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశానని జబ్బలు చరుచుకున్న జగన్ ను కూడా పక్కన పెట్టేశారు. అంటే సంక్షేమం ఎప్పటికప్పుడు టర్న్ అవుతుందా? అన్నది మాత్రం ఇక్కడ అర్థం కావడం లేదు. ఎవరు అధికారంలోకి వచ్చినప్పటికీ గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కంటే ఒకింత ఎక్కువే ఇవ్వాల్సి ఉంటుంది. కోతలు పెట్టడానికి వీలుండదని భావించి ప్రజలు మార్పును కోరుకుంటే సంక్షేమ మంత్ర పనిచేయదని చెప్పాలి.

# సినిమా

## సలార్ భామ శ్రియారెడ్డి ప్రతీసారి 60 పుష్-అప్స్ చేసేదట.. !



ఏ మాత్రం తగ్గేదేలే అంటూ హీరోలు, విలన్లతో పోటీ పడి మరి నటించే అతికొద్ది మంది నటీమణుల్లో టాప్‌లో ఉంటుంది శ్రియారెడ్డి. క్యారెక్టర్ ఏదైనా సినిమాలో ఉండే పాత్రలను డామినేట్ చేసేలా శ్రియారెడ్డి యాక్టింగ్ ఉంటుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇటీవలే పవన్ కల్యాణ్ నటించిన ఓజీ లో పవర్ ఫుల్ రోల్‌లో నటించింది. ఫిట్‌నెస్‌ను మెయింటైన్ చేసే విషయంలో చాలా మంది యాక్టర్లకు స్ఫూర్తిగా నిలిచే శ్రియారెడ్డి సలార్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది. యాక్టింగ్ చేసేందుకు వెళ్లే ముందు కూడా పుష్ అప్స్ చేసేదాన్ని అని చెప్పింది. ఓ షాట్ తీసే ముందు ప్రతీసారి 50-60 పుష్ అప్స్ చేసేదాన్ని. నా క్యారవాన్‌లో కాస్ట్యూమ్స్ సమయంలో ఇలా చేయడం నా రొటీన్ దినచర్య. పుష్ అప్స్ ప్రాథమికంగా నేను చేసే చాలా సులభమైన వర్కవుట్. షాట్‌కు అంతా రెడీ అయిందని లొకేషన్ నుంచి నాకు ఫోన్ వస్తే కొంత సమయం కావాలని రిక్వెస్ట్ చేసేది. అందుకే నా వర్కవుట్ పూర్తి చేసి వెంటనే షాట్‌కు పరిగెత్తేదాన్ని. నా వర్కవుట్ సెషన్‌తో కొత్త ఎనర్జీ వచ్చిన భావన కలుగుతుంది. నేనక్కడ (ఖన్సార్)లో చాలా మంది పురుషుల మధ్య నిలబడినప్పుడు నన్ను నేను అజేయురాలిగా భావించాలంటే.. నేను లోపలి నుంచి ఆ ఫీల్‌ను అనుభవించాలి.. అంటూ చెప్పుకొచ్చింది. శ్రియా రెడ్డి నెక్ట్స్ సలార్ 2లో కనిపించనుంది.

## మలయాళ నటికి ఊరట..

### ముందస్తు బెయిల్ మంజూరు చేసిన కేరళ హైకోర్టు

మలయాళ నటి లక్ష్మీ ఆర్ మీనన్‌కు కేరళ హైకోర్టు ఊరటనిచ్చింది. కిడ్నాప్, దాడికి సంబంధించిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో లక్ష్మీ మీనన్‌తో పాటు మరో ఇద్దరు నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బెచు కురియన్ థామస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టు 24న కొచ్చిలోని ఓ పబ్ వద్ద జరిగిన ఘటనలో నటితో పాటు ఇద్దరిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. పబ్ వద్ద లక్ష్మీ మీనన్ గ్యాంగ్, ఐటీ ప్రొఫెషనల్ మధ్య వివాదం జరిగింది. ఎఫ్ఐఆర్ ప్రకారం.. నటి లక్ష్మీ మీనన్, ఆమె స్నేహితులు బాధితుడిని వెంబడించి, ఐటీ ఉద్యోగి కారును అడ్డగించారు. ఆ తర్వాత సదరు వ్యక్తిని బలవంతంగా తమ కారులోకి ఎక్కించుకొని వెళ్లి అతనిపై పాల్పడ్డారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్, 2023 లోని కిడ్నాప్-అపహరణ, బెదిరింపులతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో నటి లక్ష్మీ మీనన్ పేరును సైతం చేర్చారు. వివాదాన్ని సామరస్య పూరక్వంగా పరిష్కరించామని.. ఈ కేసును మరింత ముందుకు తీసుకువెళ్లకూడదని పేర్కొంటూ అఫిడవిట్ దాఖలు చేసిన నేపథ్యంలో హైకోర్టు నిందితులకు అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ కల్పించింది. కేసు విచారణ సందర్భంగా ఎఫ్ఐఆర్‌లోని ప్రాథమిక ఆరోపణలు తీవ్రమైన నేరం జరిగినట్లుగా చూపిస్తుందని కోర్టు పేర్కొంది. అయితే, ఈ సమస్య పరిష్కారమైందని, పిటిషనర్లకు ముందస్తు బెయిల్ మంజూరు చేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొంటూ డీ-ఫాక్టో ఫిర్యాదుదారుడు అఫిడవిట్ దాఖలు చేశారని పేర్కొంది. ముందస్తు బెయిల్ పిటిషన్‌లో తనపై వచ్చిన ఆరోపణలన్నీ అబద్ధమని.. కేవలం ప్రేరేపితమని, కేసులో తన ప్రమేయం ఏమీ లేదంటూ ఖండించారు. దర్యాప్తు కొనసాగే వరకు మీనన్, ఇతర నిందితులు అరెస్టు నుంచి హైకోర్టు మినహాయింపును ఇచ్చింది. దాంతో నటికి ఈ కేసులో అరెస్టు నుంచి తాత్కాలిక ఉపశమనం కలిగింది.



# క్రీడా న్యూస్

## ఇక చాలు.. ఆపండి..

**దాయాదుల మ్యాచ్‌లను రద్దు చేయాలని అథర్టన్ డిమాండ్**

**ఆర్థికావసరాల కోసమే అంటూ మండిపాటు**




లండన్: చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మధ్య ఐసీసీ ఈవెంట్లలో జరిగే మ్యాచ్‌లను ఇకనైనా రద్దుచేయాలని ఇంగ్లండ్ మాజీ సారథి మైకేల్ అథర్టన్ డిమాండ్ చేశాడు. ఐసీసీ, బ్రాడ్‌కాస్టర్ల ఆర్థికావసరాల కోసమే దాయాదుల మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారని ఆయన 'ది టైమ్స్'కు రాసిన వ్యాసంలో మండిపడ్డాడు. ఇటీవలే ముగిసిన ఆసియా కప్‌లో ఇరుజట్ల మధ్య 'నో షేక్‌హ్యాండ్', ఆటగాళ్ల విపరీత ప్రవర్తన, ట్రోఫీ వివాదం నేపథ్యంలో అథర్టన్ వ్యాసం చర్చనీయాంశమవుతున్నది. '2013 నుంచి భారత్, పాకిస్థాన్ ఐసీసీ నిర్వహిస్తున్న ప్రతి ఈవెంట్‌లో గ్రూప్ దశలో తలపడుతున్నాయి. అంటే మూడు వన్డే ప్రపంచకప్‌లు, ఐదు టీ20, మూడు చాంపియన్స్ ట్రోఫీలలో ఈ జట్లు ఆడాయి. ఇరుజట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌ల కొరత ఉన్నప్పటికీ ఐసీసీ ఈవెంట్లలో ఈ జట్లు పదేపదే తలపడటం వెనుక ఉన్న ప్రధాన కారణం ఆర్థికావసరాలే.. ప్రసారహక్కుల విలువ అధికంగా ఉండటమూ దీనికి ఒక కారణం. ఒకప్పుడు క్రికెట్ దౌత్యానికి వారధిగా ఉంటే ఇప్పుడు అది విస్తృత ఉద్రిక్తతలకు దారితీసే వనరుగా మారింది. గతంలో ఒకరి భూభాగంలో ఒకరు క్రికెట్ ఆడటం అనేది రెండు దేశాలు మాట్లాడుకునే మార్గం. కానీ ఇప్పుడు ఆ స్థానంలో నిశ్శబ్దం అలుముకుంది. తదుపరి ప్రసారహక్కుల చక్రంలో అయినా ఐసీసీ ఈవెంట్‌లకు ముందు ఫిక్చర్ డ్రా పారదర్శకంగా ఉండాలి. ఉద్దేశపూర్వకంగా ఏర్పాటుచేస్తున్న ఈ ఫిక్చర్‌లను నిలిపేయాలి' అని రాసుకొచ్చాడు. రాజకీయ, సరిహద్దు ఉద్రిక్తతలను ఆసరాగా చేసుకుని వ్యూయర్‌షిప్ పెంచుకునే ఈ సంస్కృతికి ఇప్పటికైనా అడ్డుకట్ట వేయాలని అథర్టన్ డిమాండ్ చేశాడు.

## భారత జాతీయ జట్టు అని పిలవొద్దని పిటిషన్..

### చీవాట్లు పెట్టిన ఢిల్లీ హైకోర్టు..!




భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలోని క్రికెట్ జట్టును భారత జాతీయ క్రికెట్ జట్టుగా పిలువడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. విచార సందర్భంగా పిటిషనర్‌కు హైకోర్టు చీవాట్లు పెట్టింది. ఇలాంటి పిటిషన్లతో విలువైన కోర్టు సమయాన్ని వృథా చేయొద్దంటూ హెచ్చరించింది. అయితే, ప్రభుత్వ యాజమాన్యంలోని దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో వంటి సంస్థలు బీసీసీఐ ఆధ్వర్యంలోని భారత జట్టును 'టీమిండియా'గా పిలువడంపై న్యాయవాది రీపక్ కన్సల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషన్‌ను బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావులతో కూడిన ధర్మాసనంపై పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఆడుతున్న జట్టును భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం లేదని మీరు చెబుతున్నారా? అని ప్రశ్నించింది. బీసీసీఐని పక్కన పెడితే.. దూరదర్శన్, మరో సంస్థ అయినా టీమిండియా అని పిలిస్తే, చూపిస్తే అది భారత జట్టు కాకుండా పోతుందా? అంటూ ప్రశ్నించింది. క్రీడల్లో ప్రభుత్వ జోక్యం ఉంటే అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో తెలుసా? అంటూ ధర్మాసనం గుర్తుచేసింది. పిల్‌ను విచారించడం కోర్టు సమయాన్ని వృథా చేయడమేనని అభిప్రాయపడ్డ కోర్టు.. మంచి అంశాలపై పిల్ దాఖలు చేయాలని సూచించింది. బీసీసీఐ అనేది తమిళనాడు సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదైన ఒక ప్రైవేట్ సంస్థ అని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 12 ప్రకారం అది ప్రభుత్వం పరిధిలోకి రాదని న్యాయవాది రీపక్ కన్సల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ సైతం బీసీసీఐని జాతీయ క్రీడా సమాఖ్య (%చీూఖీ%)గా గుర్తించలేదని.. ఈ విషయం ఆర్టీఐ ద్వారా వెలుగులోకి వచ్చిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వ యాజమాన్యంలోని ప్రచార సంస్థలు టీమిండియా, భారత జాతీయ జట్టు అని పిలువడం, జాతీయ జెండాను ఉపయోగించడం చట్టవిరుద్ధమన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడంతో పాటు ప్రైవేట్ సంస్థకు అనవసరమైన ప్రయోజనం చేకూరుస్తుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. చిహ్నాలు, పేర్ల (అక్రమ వినియోగ నిరోధక) చట్టం-1950, ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా-2002ను ఉల్లంఘించడమే అవుతుందని వాదించారు.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

# బీసీ రిజర్వేషన్ వ్యతిరేకులకు రాజకీయ సమాధి తప్పదు

## బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు

యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి :అక్టోబర్ 08




రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 60 శాతంకు పైగా ఉన్న బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం కల్పించగా,రెడ్డి జాగృతికి చెందిన కొంతమంది రిజర్వేషన్ వ్యతిరేకులు కోర్టులను అడ్డం పెట్టుకుని రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూస్తున్నారని,బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే భవిష్యత్తులో బీసీలంతా ఒక్కటై వారిని రాజకీయంగా సమాధి చేస్తారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు పత్రికాముఖంగా హెచ్చరించారు.నేడు నల్ల గొండ జిల్లా కేంద్రంలోని జ్యోతిబాపూలే సెంటర్ వద్ద బీసీ రిజర్వేషన్ వ్యతిరేకులపై జరిపిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉన్న జనాభా కంటే 18 శాతం రిజర్వేషన్లు తక్కువ చేసి 42 శాతంతో బీసీలకు సరిపెట్టి స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ,రెడ్డి జాగృతికి చెందిన వారు రాష్ట్ర హైకోర్టులో బీసీ రిజర్వేషన్లు చెల్లవంటూ కోర్టులకు వెళ్లారని,ఐదు శాతం ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు గత 80 ఏళ్లుగా 90 శాతం పదవులు అనుభవిస్తూ బీసీల రావలసిన వాటాను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు.ఈనెల 8వ తేదీన రాష్ట్ర హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల కేసు ఉన్నందున స్థానిక సంస్థల ఎన్నికలు జరగవంటూ బీసీ రిజర్వేషన్ల అమలు కావంటూ కొంతమంది రిజర్వేషన్ వ్యతిరేకులు అదేపనిగా ప్రచారం గావిస్తున్నారని దీనిని ఎంత మాత్రం సహించబోమని అని ఆయన హెచ్చరించారు. 50 శాతం సామాజిక రిజర్వేషన్లు దాటకూడదని ఎక్కడ లేదని అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన నాడే 50 శాతం సీలింగ్ ఎత్తిపోయిందని,బీసీలకు రిజర్వేషన్లు పెంచినప్పుడే 50% సీలింగ్ గుర్తుకు రావడం చాలా శోచనీయమన్నారు.బీసీ రిజర్వేషన్ల పెంచకుండా కేసులు వేసి బీసీలకు రావాల్సిన వాటాను అగ్రవర్ణాలు తన్నుకపోతే చూస్తూ ఊరుకోమని,బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకుల భరతం పట్టడానికి బీసీలంతా ఐక్యమై రాష్ట్రంలో అగ్గి రాజేస్తామని ఆయన తీవ్ర ఆవేదనతో హెచ్చరించారు.బీసీ రిజర్వేషన్లకు గవర్నర్ ఆమోదముద్ర వేసే బాధ్యత బిజెపి పార్టీ తీసుకోవాలనిలేని పక్షంలో రిజర్వేషన్ల పెంచే బాధ్యత బిజెపి తీసుకోవాలని, రిజర్వేషన్లు ఆగిపోతే దానికి బిజెపిదే బాధ్యత ఉంటుందని బీసీ రిజర్వేషన్ల పెంపుపై అన్ని రాజకీయ పార్టీలు మద్దతుగా నిలబడాలని,బీసీ రిజర్వేషన్ల అడ్డుకోవాలని రెడ్డి జాగృతి చూస్తుంటే వివిధ రాజకీయ పార్టీలో ఉన్న రెడ్డీలు ఎందుకు ఖండించడం లేదని రెడ్డీలు ఎటువైపో తేల్చుకోవాలని సమాజంలో ఉన్న చాలామంది రెడ్డి సామాజిక వర్గానికి సంబంధించిన వారు అట్టడుగు హక్కుల కోసం.పోరాటం చేసి అట్టడుగు వర్గాల అభివృద్ధికి పాటు వడ్డారని వారిని ఎప్పటికీ మేము గౌరవిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాసోజు విశ్వనాథం కాసోజు విశ్వనాథం,నేలపట్ల సత్యనారాయణ,సోమ మల్లన్న, నకరకంటి కాశయ్య గౌడ్,కేశ బోయిన శంకర్ ముదిరాజ్, వాసుదేవుల వెంకట నరసయ్య,చిక్కుల రాములు,సొల్లేటి రమేష్ గంజి బిక్షమయ్య, ఆదినారాయణ,వాడపల్లి సాయిబాబా,ఎరుకల శంకర్ గౌడ్,కస్తూరి దామోదర్, శంకరాచారి,కంది సూర్యనారాయణ,శ్రీను, వేణు,లాలయ్య గౌడ్, చాగంటి రాములు ముదిరాజ్,జె.ఇంద్రయ్య, వెంకట రాములు,బండారి గోవర్ధన్ గౌడ్,బండారి గోవర్ధన్,నాగరాజు, జేరి పోతుల శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

**యాదాద్రి జిల్లా :రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: అక్టోబర్ 8**



రామన్నపేట పట్టణం లో ఎమ్మార్పియస్ మండల అధ్యక్షులు నోముల చిరంజీవి ఆధ్వర్యంలో సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక మీడియా సమావేశ కార్యక్రమంలో కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ నల్ల బ్యానర్ ప్రదర్శన తో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మార్పియస్ ఎంఎస్పీ సీనియర్ నాయకులు ఈర్లపల్లి మల్లన్న మాదిగ,ఎమ్మార్పియస్ జిల్లా ఉపాధ్యక్షులు నల్ల స్వామి మాదిగ లు మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన అడ్లూరి లక్ష్మణ్ ను అవమానించిన పొన్నం ప్రభాకర్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మాదిగలు అందరు ఎమ్మార్పియస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ గారి పిలుపు మేరకు తీవ్రంగా ఉద్యమాన్ని మలచి ఆందోళనలు చెపట్టి పొన్నం ప్రభాకర్ కు మాదిగల ఉద్యమ రుచి చూపిస్తామని మంత్రి పదవి భర్తరాఫ్ చేసేదాకా పోరాటం చేస్తామని అన్నారు. సాటి దళిత సామాజిక వర్గానికి చెందిన మంత్రి పై పొన్నం అనుచిత వ్యాఖ్యలు చేస్తే పొన్నం ప్రభాకర్ పక్కనే కూర్చున్న దళిత వర్గానికి చెందిన మంత్రి వివేక్ పొన్నం వ్యాఖ్యలు ఖండించక పోవడంవిడ్డూరమని దళిత మంత్రి గా మిమ్మల్ని చూసి దళితులు నివ్వేర పోతున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం లో దళిత జాతీ ఆత్మగౌరవ పథాకగా సాగుతున్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పై ఈగ వాలిన దళిత జాతీ మాదిగలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎంఎస్పీ సీనియర్ నాయకులు ఈర్లపల్లి మల్లన్న మాదిగ,ఎమ్మార్పియస్ జిల్లా ఉపాధ్యక్షులు నల్ల స్వామి మాదిగ,ఎమ్మార్పియస్ మండల అధ్యక్షులు నోముల చిరంజీవి మాదిగ,మేడి శంకరయ్య,కక్కిరేణి రవి ముత్యాల సాయిలు,గాదె సురేష్ నోముల లింగస్వామి నోముల మల్లేష్, రామచంద్రం నోముల లక్ష్మణ్, నోముల ప్రతాప్,నోముల శంకర్,నోముల లింగయ్య,నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలను వెంటనే ప్రారంభించాలి

## సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం



యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధిబీ అక్టోబర్

రాత్రి కురిసిన అకాల వర్షం మూలంగా మునిపంపుల దాన్యం కొనుగోలు కేంద్రంలో వరదకు కొట్టుకుపోయి తడిసిన వడ్లను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని లెవలింగ్ చేసి రైతులకు సౌకర్యవంతంగా ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలన చేసి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం కోతలు ప్రారంభమై వారం గడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతుల ఆందోళనకు గురవుతున్నారని వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసేందుకు అధికార యంత్రాంగం సమాయత్తం కావాలని. మునిపంపుల ధాన్యం కొనుగోలు కేంద్రం ఏటవాలుగా ఉండడంతో చిన్న వర్షానికి ధాన్యం కొట్టుకుపోయి చెరువులో పడుతున్నదని ప్రతిసారి రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోయారు. మార్కెట్లో పోసి తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యుడు తొలుపునూరి శ్రీనివాస్, శాఖ కార్యదర్శి తాళ్లపల్లి జితేందర్, సహాయ కార్యదర్శి గంటపాక శివకుమార్, నాయకులు జోగుల శ్రీనివాస్, తొలుపునూరి చంద్ర శేఖర్, బూడిద బిక్షం, గునుగుంట్ల సత్యనారాయణ,కుక్కడపు స్వామి, పులిపలుపుల నాగార్జున, మామిండ్ల నాగార్జున, కంభంపాటి ఉప్పలయ్య, పొన్న ఉప్పలయ్య, శిరీషాల యాదగిరి, నోముల నర్సిరెడ్డి, గంటపాక సాయికుమార్, మేకల శివప్రసాద్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# జస్టిస్ బిఆర్ గవాయ్ పై దాడి మతోన్మాదుల కుట్ర

## -మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్

**యాదాద్రి జిల్లా:వలిగొండ: తొవ్వ ప్రతినిధి: అక్టోబర్ 8**



భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై దాడి చేయడం మతోన్మాద ఉగ్రదాడి అని మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదని భారత అత్యున్నత మైనటువంటి రాజ్యాంగంపై జరిగిన దాడి అని అన్నారు. అత్యున్నతమైన సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి పైనే దాడి జరిగిందంటే సామాన్య ప్రజల సంగతి ఏంటో ఆలోచించాలన్నారు. యావత్ భారత దేశ ప్రజలంతా ఈ దాడిని ఖండించాలని ఆయన అన్నారు. ఈ దౌర్భాగ్యమైన చర్య ముమ్మాటికి మతోన్మాదుల చర్య అని అన్నారు. రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకునే రోజు వస్తుందని అన్నారు.

# బదిలీపై వెళుతున్న రాంజీ నాయక్ కి సన్మానం.

## -నూతన వ్యవసాయ శాఖ అధికారిగా రాజు బాధ్యతలు.



బయ్యారం,తోవ్వ,అక్టోబర్ 8.

గత ఏడు సంవత్సరాలుగా బయ్యారం మండల వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేసిన బానోత్ రాంజీ నాయక్ మహబూబాబాద్ ఏడిఏ కార్యాలయానికి బదిలీపై వెళుతున్నట్లు ఏడిఏ శ్రీనివాసరావు తెలిపారు.వారి స్థానంలో కే.రాజు నూతన మండల వ్యవసాయ శాఖ అధికారిగా బాధ్యతలు చేపడుతున్న తెలిపారు.ఈ సందర్భంగా బుధవారం కొతపేట - గంధంపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడిఏ శ్రీనివాస్ సమక్షంలో మండల పెర్టిలైజర్-పెస్టిసైడ్స్ డీలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బదిలీపై వెళుతున్న ఏఓ రాంజీ నాయక్ కు వీడ్కోలు పలుకుతూ,నూతన వ్యవసాయ శాఖ అధికారి రాజు కి స్వాగతం పలుకుతూ పూల భోకేలు ఇచ్చి శాలువాతో ఘనంగా వారిని సత్కరించారు. ఈసందర్బంగా డీలర్లు మాట్లాడుతు రాంజీ నాయక్ చిన్న సన్నగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న రైతులకు అన్ని విధాలుగా సహకరిస్తూ ప్రజల ఆధారాభిమానాలు పొందారని అలాగే నూతన వ్యవసాయ శాఖ అధికారి రాజు కూడా అందరికీ సహకరిస్తూ పని చేయాలని కోరుకున్నారు.రైతు సోదరులందరూ పంట నమోదు విధిగా చేయించుకోవాలనీ,పత్తి,వడ్లు కొనుగోలు సమయాల్లో పంట నమోదు వివరాల ఆధారంగానే అమ్మకాలు కొనగోలు చేయబడతాయి.రైతులు విధిగా పంట నమోదు చేయించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఇఓలు ఫయాజ్,నాగరాజు,తేజస్వీనీ,సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ రాజేష్, సిబ్బంది సురేష్,సతీష్,ముధాకర్ ఫెర్టిలైజర్ మండల అధ్యక్షులు సూరం సుధాకర్ రెడ్డి,డీలర్లు కళింగ రెడ్డి,శేఖర్,కార్షక్ క్రాంతి,రంజాన్,ఇస్మాయిల్,మీరా,విష్ణు తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీని వీడిన అవిరె నారాయణ.

బయ్యారం,తోవ్వ,అక్టోబర్ 8.



మండలంలోని అల్లిగూడెం గ్రామపంచాయతీకి చెందిన అవిరె నారాయణ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీని వీడుతున్నట్లు బుధవారం తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నా 14 సంవత్సరాల వయస్సు నుండి న్యూ డెమోక్రసీ పార్టీలో నాలుగు దశాబ్దాల కాలం అనేక విభాగాలలో పనిచేసినట్లు తెలిపారు.న్యూడెమోక్రసీ పార్టీ చంద్ర పుల్లారెడ్డి,గడ్డం వెంకటరామయ్య, అశోక్ అజ్ఞాత దళం సమయంలో పార్టీ కొరియర్ పని చేసి కేసులపాలయ్యామని గుర్తు చేశారు. న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు సిద్ధాంతాలను గాలికి వదిలడం వల్ల పార్టీ ముక్క చెక్కలై ప్రజాఆధరణ కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఏ పార్టీలో చేరకుండా, స్వచ్ఛందంగా జీవితం గడపాలని నిర్ణయం తీసుకున్నట్టు మీడియాకు తెలిపారు.

## అశోక్ నగర్ లో కాంగ్రెస్ పార్టీ బాకీ పడ్డ బాకీ కార్డుల ప్రచారం.....

ఖానాపూర్, సెప్టెంబర్ 08, తొవ్వ, న్యూస్:



ఖానాపురం మండల అశోక్ నగర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను వేంటనే అమలు చేయాలని నిరసన తెలియచేసి కాంగ్రెస్ పార్టీ బాకిపడ్డ బాకీకార్డులను ప్రజలుకు అ ం ద ´ చ ే య ´ ు డ ´ ం జరిగింది.ఈయొక్కకార్యక్రమంలో ఒడిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి నాయక్ మాట్లాడుతూ1 కాంగ్రెస్ పార్టీ అబద్ధపు 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీఆ ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన 100 రోజులలో అమలు చేస్తామని దొంగ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు... 2 మళ్ళీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లుకోసం ప్రజల్లోకి ఎలా వస్తారు అన్నారు. ముందు ఆరు గ్యారంటీలను అమల చేశాకే. బాకీ పడ్డ మొత్తం ప్రజలకు అందించి ఆ తరువాతే ఓట్లు అడగాలని డిమాండ్ చేయడం జరిగింది....3 కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీఎన్నికలలో ఇచ్చిన గ్యారంటీలకు బాకీపడ్డ ఈ బాకీకార్డు చూపించి కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని కోరారు .ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్,రామ సహాయం ఉపేందర్ రెడ్డి, మండల నాయలు పిన్నపు రెడ్డి, తిరుపతి రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు మచ్చ యాదగిరి రావు స్థానిక నాయకులు పాల్గొనడం జరిగింది.

## బాధితకుటుంబాన్నిపరామర్శించిన బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నన్నెబోయిన రమేష్ యాదవ్.....




నెక్కొండ, అక్టోబర్ 08, తొవ్వ న్యూస్:

బాధిత? కుటుంబాన్ని బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నన్నెబోయిన రమేష్ యాదవ్ పరామర్శించారు..నెక్కొండ వ్యాపార వేత్త కొత్త పెల్లి రాజు మరణించారు.విషయాన్ని తెలుసుకున్న నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నన్నెబోయిన రమేష్ యాదవ్ వారి స్వ గృహానికి చేరుకొని భౌతిక కాయనికి పూలమాల వేసి నివాళులర్పించారు.. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.. ?ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట మండల కాంగ్రెస్ కార్యదర్శి చేవ్వ వెంకన్న రవి మురళి సదానందమ్ రాజు శివ వెంకటేశ్వర్లు స్వామి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధితో బాలుడు మృతి.

బయ్యారం,తోవ్వ,అక్టోబర్ 8.



బయ్యారం మండలంలోని జగ్గు తండా గ్రామంలో విషాదం చోటు చేసుకుంది.గోగుల అజయ్(15) డెంగ్యూ జ్వరంతో బాధపడుతు బుధవారం మృతి చెందాడు.మృతుని తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం సెప్టెంబర్ 28వ తారీకు తీవ్ర జ్వరంతో బాధపడుతున్న కొడుకుని తీసుకొని మహబూబాబాద్ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తీసుకువెళ్లారు.ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించగా డెంగ్యూ ఫీవర్ గా వైద్యులు నిర్ధారించారు.ఆసుపత్రిలో డాక్టర్ ఎంజీఎం కు రిఫర్ చేశారు.అక్కడ వారం రోజులపాటు చికిత్స పొందుతున్న క్రమంలో రక్తకణాలు తగ్గడంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు.- అజయ్ మృతి చాలా బాధాకరం అని బాలుడు చదివే ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవేంద్ర చారి విచారం వ్యక్తం చేశారు.పదవ తరగతి చదువుతున్న అజయ్ చదువుల్లో,ఆటల్లో చురుకుగా పాల్గొనే వాడని ఒక్కసారి విన్న పాఠాన్ని మర్చిపోయే వాడు కాదని, అతని మరణ వార్త చాలా బాధాకరంగా ఉందని అన్నారు. అజయ్ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. స్కూల్లో రెండు నిమిషాల పాటు విద్యార్థులు,ఉపాధ్యాయులు మౌనం పాటించారు.

## క్షయ వ్యాధి అంతం మన పంతం :

### క్షయ వ్యాధిపై నెలవారి సమీక్ష సమావేశం:- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్.



తొవ్వ ,అక్టోబర్,8

క్షయ వ్యాధి అంతం మన పంతంఅని క్షయ వ్యాధిపై నెలవారి సమీక్ష సమావేశం:- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్.అన్నారు బుధవారం ఐ.డి.ఓ.సి లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ సంబంధిత ఆధికారులతో క్షయ వ్యాధి నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, రెండు వారాల మించి దగ్గు ఉన్న వారందరినీ, గుర్తించి తెమడ పరీక్ష చేయించాలని, అవసరమైతే ఎక్రే కూడా తీయించడానికి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కి పంపించాలని, టీబీ వ్యాధి ఆరు నెలలు మందులు వాడినచో నయం చేయబడుతుందని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో స్ఫుటం క్యాంప్స్ పెట్టాలని, జిల్లాలో క్షయ వ్యాధి అంతం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయకుమార్, డబ్ల్యూహెచ్వో కన్సల్టెంట్ డాక్టర్ బ్లేస్సి, కె.వి.రాజు హెల్త్ ఎడ్యుకేటర్,టీబీ కోఆర్డినేటర్ నీలిమా శ్వేత, అశోక్, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్, ల్యాబ్ టెక్నీషియన్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ పేరుతో మొక్క నాటిన కూతురు అమూల్య!

### హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న. .....…….



తొవ్వ న్యూస్:

హస్తినాపురం కాలానికి చెందిన చందుపట్ల పద్మావతి ఇటీవల మరణించగా బుధవారం వారి పెదకర్మ సందర్భంగా వారి జ్ఞాపకార్థంగా ఆమె కూతురు అమూల్య తో మొక్కనాటించారు హరితమిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మన బాధ్యతగా మొక్కలు నాటి వాటిని మన ఇంటిలో చిన్న పిల్లలను ఏ విధంగా సంరక్షిస్తమో అదే విధంగా మొక్కలను రక్షించాలని అన్నారు. అమ్మ పేరుతో మొక్క నాటడం జీవితంలో ఒక గొప్ప అనుభూతి అని పద్మావతి కూతురు అమూల్య తెలిపారు. మా అమ్మా జ్ఞాపకార్థంగా నాతో మొక్కలు నటించిన పర్యావరణ ప్రేమికుడు దైద వెంకన్నకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో క్రాంతి.బీజేపీ జిల్లా కార్యదర్శి ధర హిందుభారతి.ధర వెంకటేశ్వర్లు.బాబ్జీ.గోనే రవి.వెంకన్న పుల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో రెండు దగ్గు మందులపై నిషేధం

### - వైద్యుల హెచ్చరిక : చిన్నారులకు జాగ్రత్త




హైదరాబాద్, అక్టోబర్ 8, 2025: రాష్ట్రంలో రెండు దగ్గు మందులను తక్షణం నిషేధిస్తూ తెలంగాణ ప్రభుత్వం అత్యవసర ఉత్తర్వులు జారీ చేసింది. 'రీలైఫ్' మరియు 'రెస్పీఫ్రెష్-టీఆర్' అనే దగ్గు సిరప్‌లను ఇకపై విక్రయించకూడదని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈ రెండు మందుల్లో కల్తీ పదార్థాలు ఉన్నట్లు ల్యాబ్ పరీక్షల్లో నిర్ధారించబడడంతో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుంది.

### - కల్తీపై నిర్ధారణ, తక్షణ చర్య

అధికారుల సమాచారం ప్రకారం, ఈ రెండు దగ్గు సిరప్‌లు గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఫార్మా కంపెనీల ఉత్పత్తులు. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 'కోల్డ్‌రిఫ్' అనే దగ్గు సిరప్ వాడిన చిన్నారులు మృత్యువాత పడ్డ ఘటనలు వెలుగులోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా అప్రమత్తత ఏర్పడింది. దీనిపై కేంద్రం మరియు పలు రాష్ట్రాలు దర్యాప్తు చేపట్టగా, తెలంగాణ ప్రభుత్వం ముందుగానే చర్యలు తీసుకుంది. డీసీఏ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్ దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. ఈ ద్రావకాలలో ప్రమాదకర రసాయనాల మోతాదు అధికంగా ఉన్నట్లు గుర్తించబడిందని సమాచారం. ప్రస్తుతానికి అన్ని బ్యాచ్‌లను రీకాల్ చేయాలని సంబంధిత కంపెనీలకు ఆదేశాలు జారీ చేయబడ్డాయి.

### - ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయం నిషేధం

అధికారులు హెచ్చరిస్తూ పేర్కొన్నారు - షెడ్యూల్-హెచ్ కింద ఉన్న మందులను వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మడం చట్ట విరుద్ధం. అయినప్పటికీ, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పలు ఔషధ దుకాణాలు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు గుర్తించారు. కొంతమంది దుకాణదారులు ప్రతి నెలా 60 - 70 సిరప్‌లను ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తున్నారని అధికారులు తెలిపారు. సీజన్ సమయంలో ఈ అమ్మకాలు రెండు రెట్లు పెరుగుతున్నాయని, చిన్నారులు సహా అన్ని వయసుల